**నమ్మలేని నిజాలు**

రాక్షస మేఘం
వందల పిడుగులు
వర్షపు కోర.
యు. యస్. ఎ నేత
తెలివైన నియంత
కీర్తి గల్లంతు.
ఆరుద్ర కార్తె
చిత్తడి చినుకులు
పొలం పనులు.
ప్లాస్టిక్ పువ్వులు
ఆకర్షణ భ్రమలు
మాయలో జనం
కొత్త దారులు
ఉద్యోగ తగ్గుదల
రోబో విజ్ఞానం



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

**శ్రీనిజాలు**

వరుణుని కృప ఏమి లేక
భూములన్నీ తడారే
గోదావరి కృష్ణ ఎండ
తెలంగాణా ఎడారే
చుక్కనీరు దక్కకుండ
మాయ చేసే మంత్రాలు
ఇరు రాష్ట్రాలు కలిపితెగ
కనిపించని కుతంత్రాలు



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 9-7-2026  NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:262 పేజీలు:6 వెల: రూ.1/-


## ఇండోనేషియాలో 1000 ఏళ్ల క్రితం నాటి ఆలయాన్ని సందర్శించిన ప్రధాని మోదీ..



బ్యాంకాక్, జులై 8: ప్రధాని మోదీ ఇండోనేషియాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆ దేశంలో ఉన్న వెయ్యేళ్ల క్రితం నాటి హిందూ ఆలయాన్ని ఆయన సందర్శించారు. యోగ్యకర్తలో ఉన్న ప్రంబనన్ ఆలయాన్ని ఆయన విజిట్ చేసి అక్కడ పూజలు నిర్వహించారు. ప్రధాని మోదీతో పాటు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో కూడా ఆలయానికి వెళ్లారు. ప్రంబనన్ ఆలయంలో త్రిమూర్తులు కొలువై ఉన్నారు. బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుల నిలయమే ప్రంబనన్ ఆలయం.

ప్రస్తుతం ఈ ఆలయం.. ప్రపంచ వారసత్వ సైట్‌లో ఉన్నది. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌కు చెందిన ఏరియల్ వీడియోను ప్రధాని మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. ప్రబంనన్ ఆలయం అద్భుతంగా ఉన్నట్లు ఆయన ట్వీట్ చేశారు. ఆలయంలో కాసేపు ఓం నమ శివాయ అని భక్తులతో కలిసి మోదీ పూజలు చేశారు.

## గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ..



హైదరాబాద్, జులై 8: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి ఈరోజు (బుధవారం) కలిశారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు రాకేశ్ స్వామి. తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు.

ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని గోద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సీడ్ గార్డెన్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్నిఈ సంస్థ కోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రోడ్డును విస్తరించాలని ముఖ్యమంత్రిని ఈ సంస్థ ప్రతినిధులు కోరారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## పండ్ల తోటలో నక్కిన ఉగ్రవాదుల్లో ఒకడు హతం.. లష్కరే టాప్ కమాండర్ జాకీర్ అహ్మద్‌గా గుర్తింపు



న్యూఢిల్లీ, జులై 8:జమ్మూకశ్మీర్ లో ఉగ్రవాదుల ఏరివేతకు ఆపరేషన్ చేపట్టిన భద్రతాబలగాలు బుధవారం భారీ విజయం సాధించాయి. షోపియాన్ లో ఓ పండ్ల తోటలో నక్కిన ఒకడిని బుధవారం హతమార్చాయి. మృతుడిని లష్కరే తయ్యిబా టాప్ కమాండర్ జాకిర్ అహ్మద్ ఘనీ గా గుర్తించారు. అతడికి పహల్గామ్ ఉగ్రదాడితో సంబంధాలున్నట్లు దర్యాప్తు వర్గాలు చెబుతున్నట్లు సమాచారం.

షోపియాన్‌లోని ఓ పండ్ల తోటలో ఉగ్రవాదులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు ఇటీవల నిఘా కెమెరాల్లో రికార్డయ్యాయి. దాంతో జమ్మూకశ్మీర్ పోలీసులు, ఆర్మీ, సీఆర్పీఎఫ్ దళాలు జూలై 3న సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఉగ్రవాదులు నక్కిన ప్రాంతాన్ని నలుమూలల నుంచి దిగ్బంధించి వేట మొదలుపెట్టాయి. దాదాపు ఐదు రోజులుగా కొనసాగుతున్న ఈ ఆపరేషన్‌లో బుధవారం ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా బలగాలను గమనించిన ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో సిబ్బంది ఎదురుకాల్పులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు.

అనంతరం ఘటనా స్థలంలో ఓ ఉగ్రవాది మృతదేహాన్ని గుర్తించారు. అతడిని జాకిర్ అహ్మద్ ఘనీగా తేల్చారు. అతడితోపాటు ఉన్న మరో ఉగ్రవాది లతీఫ్ భట్ కోసం భద్రతా బలగాలు గాలిస్తున్నాయి. అతడు బయటకు వెళ్లకుండా తోట చుట్టూ విక్టర్ ఫోర్స్ దళాలు మోహరించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌పై జమ్మూకశ్మీర్ పోలీసులు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'మీరు పారిపోవచ్చేమో.. కానీ దాక్కోలేరు' అని ఉగ్రవాదులను హెచ్చరించారు.

కుల్గామ్‌కు చెందిన జాకిర్ ఘనీ కొన్నేళ్లుగా లష్కరే తయ్యిబా ముఠాలో కీలకంగా పనిచేస్తున్నాడు. గతంలో భద్రతా సిబ్బందిపై దాడులు, పౌరుల హత్యల కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. అప్పటి నుంచి అతడిపై నిఘా వర్గాలు దృష్టి పెట్టాయి. 2025 ఏప్రిల్‌లో పహల్గాంలో చోటుచేసుకున్న భీకర ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తు సమయంలోనూ జాకిర్ పేరు వినిపించింది. ఆ కేసు దర్యాప్తులో భాగంగా జాకిర్‌కు సంబంధించిన ఓ ఇంటిని కూడా కూల్చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.

## ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం 'టైమ్ వేస్ట్ ప్రోగ్రామ్': డొనాల్డ్ ట్రంప్



న్యూఢిల్లీ, జులై 8 :అంకారా, జులై 8: ఇరాన్‌తో కుదుర్చుకున్న తాత్కాలిక అవగాహన ఒప్పందం(ఓనీఇ) కథ ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే.. ప్రస్తుతానికి చర్చలు కొనసాగించడానికి మాత్రం అనుమతిస్తానని ఆయన పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు పాల్పడిందన్న ఆరోపణలతో.. ఇరాన్‌కు చెందిన రేవు పట్టణాలైన బందర్ అబ్బాస్, సిరిక్, అలాగే కెస్మ్ ద్వీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా భారీ వైమానిక దాడులు జరిపిన కొద్ది గంటల్లోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది.

మరోవైపు.. ఇరాన్ చమురు విక్రయాలకు సంబంధించి గతంలో ఇచ్చిన మినహాయింపు లైసెన్స్‌ను కూడా వాషింగ్టన్ రద్దు చేసింది. దీనికి ప్రతిచర్యగా బహ్రెయిన్, కువైట్‌లలోని అమెరికా లక్ష్యాలపై ఇరాన్ ఎదురుదాడులకు దిగింది.

టర్కీ రాజధాని అంకారాలో జరుగుతున్న రెండు రోజుల నాటో(ఔయిూ) సదస్సు సందర్భంగా ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. కాల్పుల విరమణ స్థితిపై స్పందిస్తూ.. 'నా దృష్టిలో అయితే అంతా అయిపోయింది. ఇకపై వారితో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవాలని నేను అనుకోవడం లేదు. వారితో చర్చలు జరపడం కాలయాపన మాత్రమే. వారు నీచులు. నీచులు అంటే ఏంటో మీకు తెలుసా? మానసిక రోగులు. వారిని నడిపించే నాయకులు కూడా మానసిక రోగులే. వారు అత్యంత క్రూరులు, హింసాత్మక ప్రవృత్తి గలవారు. వారి చేతికి గనుక అణ్వాయుధం చిక్కితే, వారు కచ్చితంగా దానిని వాడేస్తారు. అందుకే నా పరంగా ఈ ఒప్పందం ముగిసిపోయింది' అని ట్రంప్ అన్నారు.

అమెరికా ప్రతినిధులు ఇరాన్‌తో చర్చలు కొనసాగించవచ్చని, అయితే దానివల్ల ఎలాంటి ఫలితం ఉంటుందనే దానిపై తనకు నమ్మకం లేదన్నారు. 'వారు మాట్లాడుకుంటే మాట్లాడుకోవచ్చు, కానీ వారు తమ సమయాన్ని వృథా చేసుకుంటున్నారని నేను భావిస్తున్నాను' అని ట్రంప్ స్పష్టం చేశారు.

## పదకొండేళ్ల బాలికపై హత్యాచారం కేసు.. నిందితుల్లో ఒకడు పోలీస్ ఎన్‌కౌంటర్లో హతం..!



న్యూఢిల్లీ, జులై 8: పశ్చిమబెంగాల్ లోని బరుయ్‌పుర్ లో 11 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి హత్యచేసిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుల్లో ఒకడు బుధవారం తెల్లవారుజామున పోలీసుల ఎన్‌కౌంటర్ లో మృతిచెందాడు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం అతడిని తీసుకెళ్లగా పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. ఓ పోలీసు వద్ద ఉన్న తుపాకీ లాక్కొని పారిపోవడానికి యత్నించడమే కాకుండా.. ఒక రౌండ్ కాల్పులు కూడా జరిపాడని పేర్కొన్నారు. దాంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా అతడికి బుల్లెట్ గాయాలయ్యాయని వెల్లడించారు. వెంటనే ఆసుపత్రి కి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ కేసులో అతడు ప్రధాన నిందితుల్లో ఒకడని, బాలిక అదృశ్యమయ్యే ముందు ఆమెతో కలిసి ఉన్నట్లు సీసీటీవీ దృశ్యాల్లో గుర్తించినట్లు చెప్పా రు. హత్యాచార ఘటనపై స్థానికుల నుంచి తీవ్ర ఆందోళనలు వ్యక్తమైన విషయం తెలిసిందే. బాలిక మృతదేహం లభించిన కొద్ది గంటల్లోనే అనుమానంతో ఓ వ్యక్తిని స్థానికులు కొట్టిచంపారు. ఈ కేసులో ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు ఆరుగురు సభ్యు లతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు ఈ ఘటనపై 72 గంట ల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ముఖ్యమ ంత్రి సువేందు అధికారి డీజీపీని ఆదేశించారు.

## టీటీడీ బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యునిగా దేవాదాయశాఖ కార్యదర్శి ప్రమాణం



తిరుపతి, జులై 8: టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు బుధవారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు.

అనంతరం కార్యదర్శి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. రంగ నాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వ చనం చేశారు. కె.కన్నబాబుకు శ్రీవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అదనపు ఈవో అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవోలు భాస్కర్, ప్రశాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కొత్త కేటాయింపు కాదు..

### –తాడిచర్ల కోల్ బ్లాక్ కేటాయింపుపై భట్టి క్లారిటీ

హైదరాబాద్, జులై 8: సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ -2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటి అని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో పెట్టారని.. ఎమ్ఎమ్‌బీఆర్(ఓఓఃఖీ) యాక్ట్ రాకముందే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని తెలిపారు.

కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్3కు టెండర్ వేశారని అన్నారు. బీఆర్ఎస్ బినామీలు ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారన్నారు. ఇన్నాళ్లూ సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ లీజుకు ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. గోదావరి పరిసరాల్లోని కోల్ బ్లాక్స్ అన్నింటినీ సింగరేణికి కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను విజయవంతం చేయాలి



హన్మకొండ, జులై 8:ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధుల సహకారంతో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

జిల్లాలో ఇప్పటివరకు 98.96 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తైందని, 25.79 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఫారాలు పంపిణీ చేస్తున్న నేపథ్యంలో వాటి స్వీకరణలో రాజకీయ పార్టీల బీఎల్ఏలు సహకరించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

జూలై 24న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ చేపడతామని తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా, అనర్హుల పేర్లు తొలగించేలా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

**రాధశ్రీ రాగాలు**

శివకరుని తనయుండు
సిద్ధి విఘ్నేశుండు
భక్త జన సులభుండు
అనును రాధశ్రీ !!
అరయగ సనాతనము
అది నిత్య నూతనము
కాదది పురాతనము
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210



గురువారం (ఈనెల 2న) ప్రెస్ అకాడమీ కార్యాలయంలో నేటినిజం పత్రిక ప్రచురించిన **"ఆలోచనల ఆవిష్కరణ"** పుస్తకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీ కె. శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో శ్రీమతి బైస వీణాదాస్, బైస దేవదాస్, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, ఆజాం ఖాన్.

## బాన్సువాడ బాలికల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

కామారెడ్డి, జులై 8: జిల్లాలోని బాన్సువాడ ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య కలకలం రేపుతుంది. హాస్టల్ గదిలో ఇంటర్ విద్యార్థిని అమృత ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మద్నూర్ మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన అమృత హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ బైపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతుంది.

జ్వరం ఉందని కాలేజీకి వెళ్లకుండా ఉదయం హాస్టల్‌లోనే ఉండిపోయింది. మధ్యాహ్నం వచ్చిన తోటి విద్యార్థినిలు అమృత ఆత్మహత్య విషయాన్ని హాస్టల్ సిబ్బందికి సమాచారం అందజేశారు. దీంతో వారు పోలీసులకు, విద్యార్థిని కుటుంబ సభ్యులకు వివరించారు. కుటుంబ సభ్యులు హాస్టల్‌కు చేరుకుని ఆందోళన నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎఫ్‌బీఐ వాంటెడ్ జాబితాలో పంజాబ్ పోలీసు ఆఫీసర్

న్యూయార్క్, జులై 8: అమెరికా ఎఫ్‌బీఐ వాంటెడ్ జాబితాలో ఓ పంజాబీ పోలీసు ఆఫీసర్ ఉన్నారు. ఆపరేషన్ హార్డ్ బాల్ పేరుతో అమెరికా ఓ ఆపరేషన్ నిర్వహించింది. ఇండియా నుంచి నేరాలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకునే క్రమంలో ఆ ఆపరేషన్ చేపట్టారు. అయితే మొత్తం 37 మంది భారతీయ నేరస్థులను వాంటెడ్ లిస్టులో అమెరికా చేర్చింది. గ్యాంగ్‌స్టర్లు లారెన్స్ బిష్ణోయ్, భగవాన్‌పురియా కూడా ఆ జాబితాలో ఉన్నారు. ఓ మర్డర్ కేసులో పోలీసు ఆఫీసర్ గురిందర్జీత్ సింగ్ అమెరికాలోని ఓ బాధిత కుటుంబం నుంచి సుమారు నాలుగు లక్షల డాలర్లు వసూల్ చేసినట్లు ఎఫ్‌బీఐ ఆరోపించింది. లాస్ ఏంజిల్స్‌లో జరిగిన మీడియా సమావేశంలో యూఎస్ అటార్నీ ఫస్ట్ అసిస్టెంట్ బిల్ ఎస్సేలీ ఈ విషయాన్ని తెలిపారు.

**చురక**

మాటల కోటలతో
మనసులెట్ల గెలుస్తారు
చేతలు లేకుంటే
జనంలెట్ల నిలుస్తారు.
పాతవాళ్ల తప్పులను
పదేపదే అంటరేంది
ఇప్పుడేమి చేస్తున్నరో
ఇడమర్చి చూపరేంది.



-వేల్పుల నారాయణ
9440433475

## వివేక వీచికలు

త్యాగానికి
సర్వశ్రేష్ఠ నిర్వచనం
స్వామి వివేకానంద
జీవన దర్శనం.
విశ్వమానవ హృదయంలో
తేజోపుంజం
సూర్య చంద్రులుండుదాకా
ప్రభంజనం.
సింహపు నడక
రాచఠీవి ఆ పుట్టుక
మాట మధురం
సంకల్పం వజ్రం.
మహోజ్వల మానవత్వ
ప్రేరేపకుడు.
నవ భారత యువతా
ప్రేమికుడు.
స్వామికి, బుద్ధునికీ
పోలికలు,
విశ్వం దిశ మార్చిన
జ్ఞాన దీపికలు.
ఆధ్యాత్మిక శాస్త్రీయత
స్వామి ప్రాణం.
పశ్చిమాన అది
తిరుగులేని అస్త్రం.
షడ్రసోపేత
భోజనం కన్నా,
ఆకలి రుచే
స్వామికి మిన్న.
'సర్వం నాదే' అనే
మహద్భావం,
లేదంటే అంత విశ్వజనీనత
ఏలా సాధ్యం?
చికాగో లో
శాంతి విస్పోటనం,
విశ్వమంతా వ్యాపించే
దాని పరిమళం.
ఇనుప కండలు
ఉక్కు నరాలు,
యువతకు వరాలు
జయానికి చేవ్రాలు.
సంపద, కీర్తి
మూనాళ్ళ ముచ్చటే!
ఏమి కావాలింక
మంచికోసం మరణిస్తే.
ఆత్మ విశ్వాసమే
ప్రపంచ చరిత్ర
అది లేకనే
యువతకు దురవస్థ.
(స్వామి వివేకానంద
వర్ధంతి సందర్భంగా)



-మాయకుంట్ల
నారాయణరెడ్డి
9989686603

# నిత్య సాహితీ కృషీవలుడు రావూరి భరద్వాజ

-డా|| పాలకుర్తి మధుసూదనరావు

హైదరాబాద్, జులై 8: రావూరి భరద్వాజ కథా.. నవల.. రేడియో రచయితగా మంచి పేరు తెచ్చుకున్నారని.. నిత్య సాహితీ కృషీవలుడు భరద్వాజ అని హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం పూర్వ సంచాలకుడు డా|| పాలకుర్తి మధుసూదనరావు కొనియాడారు.

జీ.వీ.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాయ గానసభలోని కళా లలిత కళా వేదికలో ప్రముఖ రచయిత, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా||.రావూరి భరద్వాజ జయంతి వేడుకల సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పాలకుర్తి మధుసూదనరావు మాట్లాడుతూ .. రావూరి భరద్వాజ 27 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస ఆత్మకథా సంపుటాలు 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచించారని చెప్పారు. తెలుగు సాహిత్య రంగానికి భరద్వాజ తన జీవితాంతం ఎనలేని కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉ







డా||రావూరి భరద్వాజ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు. ○ సంగీత కళాకారిణి హరిప్రియ, పరావస్తు లోకేశ్వర్‌లకు పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు పొత్తూరి సుబ్బారావు, రావూరి వెంకట కోటేశ్వరరావు, బైస దేవదాసు, డా||పాలకుర్తి మధుసూదనరావు, కేతవరపు రాజ్యశ్రీ, పెద్దూరి వెంకటదాసు. ○ సభలో ప్రసంగిస్తున్న డా|| పాలకుర్తి మధుసూదనరావు

ండేదని అన్నారు.

సభా ప్రారంభకులు సాహితీవేత్త పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ భరద్వాజ బాల సాహిత్యంలో కూడా విశేష కృషి చేశారని అన్నారు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ ఉత్కృష్ట రచనగా పరిగణింపబడుతోందని ఆయన పేర్కొన్నారు. ఆడంబరాలులేని సాధారణ జీవితం ఆయనదని ఆయన చెప్పారు. భరద్వాజకు దిగువ మధ్యతరగతి పేద ప్రజల భాషపై గట్టిపట్టు ఉందని, ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయివరకే చదువుకున్నారని, ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారని సుబ్బారావు అన్నారు. చిన్నతనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించేవారని ఆయన పేర్కొన్నారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆలోచనలు, ఆవేశాలు, కోపాలు తాపాలు గమనించి భరద్వాజ ఆ అనుభవా లను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించుకున్నారని సుబ్బారావు వ్యాఖ్యానించారు.

సభకు అధ్యక్షత వహించిన నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ.. భరద్వాజ విద్యాభ్యాసం 7వ తరగతి పాసైన భరద్వాజ తరగతి గదిలో జరిగిన అవమానం భరించలేక 8వ తరగతి పూర్తి చేయకుండానే ఆకలి తీర్చుకోవడానికి అన్ని రకాల పనులు చేశారు. నీళ్ళు త్రాగి గడిపిన రోజులూ వున్నాయి. చదువు సంధ్యాలేదని పలువురు మాటలకు లైబ్రరీనే విశ్వ విద్యాలయంగా ముఖ్యమైన పుస్తకాలను చదువడం, అందులోని జ్ఞానాన్ని తెలుసుకుని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను గుర్తెరిగి రచనలు చేశారని అన్నారు. మద్రాసులో వున్నన్ని రోజులు సినిమా ప్రపంచంలో అనేకానేక సంఘటనలను దృష్టిలో పెట్టుకుని పాకుడురాళ్ళు నవల రాసి అందరి మెప్పుపొందారని, వాస్తవాలు రాస్తున్నందుకు కొందరు సినీ ప్రముఖులు చంపుతామని బెదిరించినా కలానికి మరింత పదును పెట్టారేగాని వెనుకడుగు వేయలేదని వివరించారు. నీతికి, నిజాయితీకి కట్టుబడి జీవించిన గొప్ప వ్యక్తి అని డా||రావూరి భరద్వాజని కొనియాడారు. ఆకలి, అవమానాలే తనను గొప్ప రచయితను చేశాయని, తనను నమ్ముకున్న సహచరి కాంతంను కాంతమ్మగా సంబోదిస్తూ ఎనలేని ప్రేమను చాటాడని, ఆమె గతించిన తర్వాత **"కాంతమ్మ స్మారక పురస్కారం"** ప్రకటించడం భరద్వాజ గొప్పతనం అని అని అన్నారు.

ప్రతి సంవత్సరం డా||రావూరి భరద్వాజ, కాంతమ్మ పేర స్మారక పురస్కారాలు ప్రదానం చేస్తున్న భరద్వాజ కుటుంబ సభ్యులను అభినందించారు. ఇంతటి గొప్ప పురస్కారాలను సంగీతంలో శ్రీహరిప్రియకు, సాహిత్యంలో పరవస్తు లోకేశ్వర్‌కు ప్రదానం చేయడం అభినందనీయమని అన్నారు. కవి, రచయిత, ఉపన్యాసకులు, చరిత్రకారులు పరవస్తు లోకేశ్వర్ **'సలాం హైదరాబాద్'** రాసిన నవల అందరి మన్ననలు పొందిందని, స్మారక పురస్కారాలు అందుకున్న పరవస్తు లోకేశ్వర్‌ను అభినందించారు.

రచయిత్రి కేతవరపు రాజశ్రీ రచయిత భరద్వాజ రచనలు వివరంగా మాట్లాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి వీ.వీ.రాఘవరెడ్డి నివేదిక చదివారు.

ఈ సందర్భంగా రచయత పరవస్తు లోకేశ్వర్‌కు సభలో పాల్గొన్న అతిథులు రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారం ప్రదానం చేసి, పదివేల రూపాయలు నగదు పారితోషికం బహూకరించారు.

అదే విధంగా సంగీత కళాకారిణి హరిప్రియను అతిథులు రావూరి కాంతమ్మ స్మారక సేవా పురస్కారం ప్రదానం చేసి, ఐదు వేల రూపాయలు నగదు పారితోషికం బహూకరించారు.

పురస్కార గ్రహీత పరవస్తు లోకేశ్వర్ స్పందిస్తూ.. రావూరి భరద్వాజగారి వ్యక్తిత్వంతో పాటు ఆయన రచనలు ఎంతో గొప్పవని ఈ పురస్కారం అందుకున్నందుకు సంతోషంగా వుందని తనను ఎంపిక చేసినందుకు భరద్వాజ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

మరో పురస్కార గ్రహీత శ్రీమతి హరిప్రియ స్పందిస్తూ శ్రీమతి కావూరి కాంతమ్మ స్మారక సేవా పురస్కారం తనకు ప్రదానం చేసినందులకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సభలో రావూరి భరద్వాజ కుమారుడు రావూరి వెంకట కోటేశ్వరరావు, పెద్దూరి వెంకట దాసు తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు బాల నర్తకీ మణులు చిన్నారి శ్రీధృతి తిమ్మరాజుచే 'రామాయణ శబ్దం' కూచిపూడి నృత్యం, కోమల సమన్విత ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి.

కళాకారులందరిని జ్ఞాపికలతో అతిథులు సత్కరించారు.



పొత్తూరి వెంకటేశ్వర రావు గారి ముని మనుమరాలు తిమ్మరాజు శ్రీధృతిని అభినందిస్తున్న శ్రీమతి బైస వీణాదాస్, పొత్తూరి జయలక్ష్మి.

## అక్షరమే-నా అక్షయపాత్ర!

నా ఆస్తిత్వపు లోతుల్లోంచి
ఉదయించిన సూర్యుడు అక్షరం
నా మౌనపు పొరలను ఛేదించుకుంటూ
ఓ వెల్లువలా వచ్చిన చైతన్యం అక్షరం
నా అజ్ఞానపు అంచులను దాటుకుంటూ
నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకునే
నిత్య ప్రయోగశాల అక్షరం.
హలం పట్టాల్సిన చేతులతో
కలం పట్టుకున్న వేళ
నేల తల్లి నేర్పించిన సహనం
అక్షరమై నాలో ఆవహించి ప్రవహించింది.
నా మూలాల పునాదిని గౌరవిస్తూ
తారస్థాయికి తీసుకెళ్లింది.

నా రేపటి ఊపిరి
నేను రాసే అక్షరమేనని తెలిసిన మరుక్షణం
మరణం పట్ల భయం పోయింది
జీవించడం పట్ల గౌరవం పెరిగింది.
కాలమూ కాదు, మనుషులూ కాదు
అక్షరమే నన్ను మార్చింది
శిల్పిలా నా అంతరంగాన్ని చెక్కింది
జ్యోతిలా నా ఆత్మను మేల్కొల్పింది.

అక్షరమే నా సర్వస్వం
అక్షరమే నా అస్తిత్వం
అక్షరం నా జీవన నిధి
అక్షయ పాత్రలా...
ఎప్పటికీ తరగని శక్తి ప్రదాత.
రేపు నా శరీరం మట్టిలో కలిసినా
అక్షరమే..
నా శ్వాసగా మిగిలి ఉండే
చిరకాల చిహ్నం.



-ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## జిగిరీలు

చలికాలం వానపడితే ఎంత కష్టమో
ఒకరెనుకా ఒకరు చుట్టాలు వస్తే
అంత కష్టం.
ఒకడు దిగిన వెంటనే
ఇంకొకడు వాలిండు
సీటు దొరకక
వెనుక బస్ లో వచ్చినట్లున్నడు.
వాళ్ళ భాష మాకు రాదు
మా గొనుగుడు వాళ్లకు చేరదు
ఏడుపొక్కటే అన్నిటికీ పెన్సిలిన్ మందు
ఒకడు ఏర్ టెల్ లా కిర్రుమంటడు
ఇంకోడు జియోలా కుయ్యుమంటడు.
తల్లులకు నిద్ర లేదు
తండ్రుల తండ్లాటా అంతాఇంత కాదు
నానమ్మకు కన్నంటదు
తాతను కొత్తగా జైన్ చేసుకున్నరు
కేర్ టేకర్ గా .
ఒకడు పిడికిలి పట్టి
లేనిపళ్లను కొరుకుతూ
బుసలు కొడుతడు
పగిడిత రాజు కదా
అడవి గాలి తాకిందమో.
ఒకడు ఉన్న చోటనే చేతులూపుతూ
నా కోసం మీరు బాగుండాలని
చల్లగా చూస్తడు మెల్లగా నవ్వుతడు
కరుణామయుడంటే ఇతనేమరి.
ఎంత రహస్యంగా తిరుగుతున్నా
నన్ను పట్టుకునే విద్య ఏదో వున్నది వీళ్ళలో
పిలువ కుండానే
ఇంటికి గుంజుతున్నరు
కనిపించని మొగుదాడేదో కట్టినట్లున్నరు
ఈ బుధ గ్రహాల చుట్టే
ఇల్లంతా తిరుగు తున్నది
వాళ్ళ ఏడుపైనా
ఏదో తెలియని వింతానుభూతి
వాళ్ళ నవ్వులకు
గువ్వల్లా ముడుచుకున్న
ఆనంద గ్రంధులు తరంగాల్లా
ఎగిసిపడతయి
చెవి అంచు నుంచి వెళ్లే ఏ మాటైనా
వాళ్లే పిలుస్తున్నట్టు
కేకలు అరుపుల భాషలో వాళ్లే రమ్మన్నట్టు
జెమిలి గా తీసే వీళ్ళ రాగాలకు
రెహమానే స్టన్నైపోవాలి.
ఎక్కడి నుంచి వచ్చారో కానీ
ఇష్టమైన ఇంటి పెద్దలైపోయారు
గంట ఇంటి పట్టు లేకుంటే
తట్టుకోలేనంత చేశారు.
ఎంతైనా ఎక్కడికి పోలేని
జిగిరీలైపోయారు
వీళ్ళ రాజ్యాంగమే
అమలవుతున్నది ఇక్కడ
(ఇద్దరు మనుమల కోసం)



-డా|| ఉదారి నారాయణ
9441413666

## అగ్గి పిడుగు అల్లూరి

దాస్య శృంఖలాలు తృంచ
దూసుకొని పోయిన విల్లు - అల్లూరి!
బాణాలు చేబూని సేనానిగా మారి
బరిలోకి దిగినాడు గురినెరిగి విలుకాడు!
అడుగడుగునా అగ్గి పిడుగులే కురిపించి
అణువణువున నిప్పు కణికలే రగిలించి
విప్లవ శంఖము పూరించే వీరుడు!
పశ్చిమ దొరలను పారదోలగా
కారా గృహములు కొల్లగొట్టి
తుపాకి తూటలు కూడబెట్టి
నార సింహమై గర్జించినాడు...
శత్రుగుండెల్లో నిదురించినాడు.
చుట్టుముట్టిన జట్టు సేనకు
ఎక్కు పెట్టిన మందుగుండుకు
ఎదురు నిలిచిన ధీర శరమై
దిక్కు దిక్కున మారుమ్రోగే
దివ్యగీతము "వందే మాతర" మై!!
(అల్లూరి సీతారామరాజు
జయంతి సందర్భంగా
అక్షర నివాళి)



-బిల్ల అలివేణి
8500060978

# 'వాయిస్ ఆఫ్ సైలన్స్ ('నిశ్శబ్ద స్వరం')

## ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆంగ్ల కవితా రజతోత్సవం

పుస్తక సమీక్ష





ప్రతులకు:
ఆచార్య కొలకలూరి ఇనాక్
సెల్:



ఆచార్య కొలకలూరి ఇనాక్ 'వాయిస్ ఆఫ్ సైలన్స్' ఆంగ్ల కవితా సంపుటి, లబ్ద ప్రతిష్టులైన ఒక తెలుగు మహా కవి ప్రపంచ కవితా సామ్రాజ్యానికి అందించిన సౌందర్యాత్మక తాత్విక అన్వేషణా తరంగం. హృద్యంగమమైన అనుభూతుల భావ సంపర్తితమైన ఈ కవితా సమాహృతికి యిది రజతోత్సవ సందర్భం.

"Let my silent love
bless my eloquent pain"

ఈ నిశ్శబ్ద ప్రేమ, కవి హృదయాన్ని వెంటాడే వేదనను దీవించే భావనతో, ఆచార్య ఇనాక్ ఈ కవితాక్షరాలను అంకురింపచేసారు.

"Let my tears implant
my roots even in deserts
to reap the harvest of
spiralling rainbows of laughter"

నిర్జీవత్వానికి ప్రతీక నిర్జల భూమి ఎడారిలో కవి హృదయవేదన కన్నీళ్ళు, తన మూలాలు నాటాలని, దరహాసాల హరివిల్లు, సత్ఫల పర్వాకగా ప్రతిఫలించాలని ఇనాక్ అద్భుతంగా అభిలషిస్తారు. ఈ 'వాయిస్ ఆఫ్ సైలన్స్' సృష్టికర్త ఆంగ్ల మూలంలో ఆచార్య ఇనాక్, సాహితీజీవన ప్రస్థానంలో ఒక స్వర్ణాధ్యాయం. తెలుగు కవితా సాహితీ సీమలో అపురూప ప్రతిభా ప్రయోక్త, చిరఃస్మరణీయ అభ్యుదయ భావోత్తేజ తేజస్వి డా||అద్దేపల్లి రామమోహన్‌రావు "నిశ్శబ్ద స్వరం' పతాక శీర్షికన తెలుగుసేత ప్రప్రథమ ప్రచురణగా 2008లో వెలుగు చూడటం కవితాత్మక చారిత్మక సన్నివేశం అయింది. తన సర్వస్వం అయిన సహధర్మచారిణి కీ.శే. శ్రీమతి కొలకలూరి భాగీరథిగార్కి, నిశ్శబ్ద స్వరం తెలుగు సంపుటిని ఆచార్య ఇనాక్ శ్రద్ధాంజలిగా సమర్పించటం విశేషాంశం. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త నిర్వహణలో 'నిశ్శబ్ద స్వరం', తెలుగుసేత కవితా సంపుటి డా||అద్దేపల్లి రచన ద్వితీయ ప్రచురణ, ప్రొ.కొలకలూరి సాహితీ సప్తాహ సారథి శ్రీ త్యాగరాయ గాన1సభ కళా వి.ఎస్.జనార్ధన్ మూర్తి అధ్యక్ష సమారోహంలో బుధవారం ఆవిష్కరింపబడింది.

2014లో భారత ప్రభుత్వ అత్యున్నత గౌరవ పద్మశ్రీ పురస్కారం వరించిన ప్రొ.ఇనాక్, అవిశ్రాంత జీవన ప్రస్థానంలో సదీర్ఘ విద్యా, పరిశోధక, రచనా సృజనాత్మక సాహితీ స్రష్టగా నేటికీ మాతృభాషకు సేవలందిస్తున్నారు. జాతీయ స్థాయిలో వివిధ విశ్వవిద్యాలయాలతో విద్యా సంబంధిత అనుబంధం ఉంది. ఆంగ్లంలో కవిత్వం, నవల, నాటకం, ఆత్మ కథ, స్వీయచరిత్ర గ్రంథాలు రచించారు. కవిత్వం, నాటకం, నాటికలు, నవల, చిన్న కథలు, విమర్శ, అనువాదం, పరిశోధన అన్ని సాహితీ ప్రక్రియలలో అసంఖ్యాక ప్రచురణలు న్నాయి. భారతీయ జ్ఞానపీఠ్ 'మూర్తిదేవి' అత్యున్నత జాతీయ అవార్డ్ స్వీకర్తగా, తెలుగును జాతీయ, అంతర్జాతీ జ్ఞానపీఠ, నోబెల్ సాధించే స్థాయివైపు అడుగులు వేస్తున్న అగ్రశ్రేణి కీర్తి శిఖరం అధిరోహించారు.

డా||అద్దేపల్లి రామమోహనరావు ప్రార్థన (Prayer) నుండి నిశ్శబ్ద ధ్వనులు (Sounds of Silence) వరకు 55 శీర్షికలతో ఆంగ్ల కవితలను తాను కవి హృదయాభిరాముడు కావటంతో తాదాత్మ్యంతో అనుసరించారు. అణచివేత, అన్యాయాలకు గురి అవుతున్న దళిత, పేద, అభాగ్య మానవాళి తమ వేదనను నిరాశ, నిస్పృహ, క్రోధావేశాలతో కాకుండా మౌనంగా వ్యక్తీకరించే కవితా స్పృహానుభావాన్ని, ఆంగ్లంలో ఇనాక్ కవితాపరంగా ఆవిష్కరించారు. సృష్టికర్త, అనువాదకుడు అన్యోనులు కావటంతో 'వాయిస్ ఆఫ్ సైలన్స్', తెలుగులో నిశ్శబ్ద స్వరంగా పరిపూర్ణంగా ధ్వనించింది.

2001లో, జ్యోతి గ్రంథమాల, అనంతపూర్ ప్రచురించిన 'వాయిస్ ఆఫ్ సైలన్స్' రజతోత్సవంలో అడుగు పెట్టిన విశిష్ట ఆంగ్ల కవితా సంపుటి. నాటి దేశాధ్యక్షుడు కె.ఆర్.నారాయణన్ అంకిత స్వీకృతి పొందిన ఈ సంపుటిని కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు రమాకాంత్ రథ్, ప్రొ.కె.సచ్చిదానందన్, ప్రొ.ఇంద్రనాథ్ చౌధురి, డా||హెచ్.ఎస్.శివప్రకాశ్, డా||వాసుదేవరెడ్డి 'వాయిస్ ఆఫ్ సైలన్స్'కు ప్రశంసనీయమైన ముందు మాటలలో శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌గా నాడు సేవలందిస్తున్న ప్రొ.కొలకలూరి ఇనాక్‌ను ఆంగ్ల సాహితీ ప్రపంచానికి పరిచయం చేసారు. 1954 నుంచి వ్రాస్తున్న ఆచార్య ఇనాక్ రచనా వ్యాసంగానికి, స్వర్ణోత్సవం నిండి ప్రస్తుతం ఏడు దశాబ్దాల, 75వ ప్లాటినంజుబ్లి అందుకోబోతోంది.

I Salute shoes అనే అపురూప కవిత ఊహకందని చిత్రాన్ని ప్రదర్శిస్తోంది.

shoes can't enter a temple
suffering like a faceless human heart
where blind rock dominate
and can't reach corridors of power
where dogs bark and jackals heckle
I salute them.

చెప్పులు గుడిలోకి ప్రవేశించలేవు.
కుక్కలు మొరిగే చోట
నక్కలు ఊళపెట్టేచోట
అధికార ప్రాంగణాల్లోకి అవి చేరుకోలేవు.
చెప్పులకు నేను తలవంచుతున్నాను.

(ఆచార్య పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ జన్మదినోత్సవ సాహితీ సప్తాహం 01.07. 2026 నుండి 07.07.2026 సందర్భం పురస్కరించుకుని)



-జయసూర్య
సెల్:9440664610

## సప్త పదులు

ప్రక్రియా సృజనకర్త: సుధామ



సంక్షేపణ
విక్షేపణ

ఎన్ని
ప్రభుత్వాలు
మారినా
ఆగదు ఆక్షేపణ
-సమీా ఉల్లాఖాన్,
ఖమ్మం

వయసు
మనసు

పరుగుల్లో
గెలుపు
ఎవరిదో
ఎవరికి తెలుసు
-మోదుగ బాలసుబ్రహ్మణ్యం
గుంటూరు

పరిస్థితి
గ్రహస్థితి

ఏవి
ఎలాగున్నా
ప్రశాంతంగా ఉండాలి
మనస్థితి
-చంద్రకళ.దీకొండ
హైదరాబాదు

మానవుడు
దానవుడు
సృష్టిలో
ప్రాణి మనుగడకు
మూలం
మాధవుడు..
-వి. సుబ్బారావు
9000729678

మీరకు,
జారకు,

అనవసరంగా
కలిపించుకుని
మాటల మధ్యలో
దూరకు.
-చెరుకుపల్లి గాంగేయ్
శాస్త్రి, రాజమండ్రి

మెతుకు
బ్రతుకు
జీవనం
గడవడానికి
సంపాదనా మార్గాలను..
వెతుకు.
-కాకర్ల చెంచలరావు
ఒంగోలు.

చూసేది
చేసేది
సంఘానికి
పనికివచ్చేదే
రచయితల్లారా
దయచేసి రాసేది.?
-డా||సి. వసుంధర
చెన్నై

జయప్రదం
శుభ ప్రదం

ప్రణాళికాబద్ధంగా చేసే
కార్యక్రమం
ఏదైనా
ఫలప్రదం
-మాణిక్య లక్ష్మి
హైదరాబాద్

ఆచారం
గ్రహచారం

అనుకున్నవన్నీ
జరగకపోతే
చేసుంటాము
ఏదో అపచారం
-ద్విభాష్యం నాగలక్ష్మి
అనకాపల్లి

సవ్యంగా.
భవ్యంగా.

వరుణుని
కరుణతో
ఏరువాక సాగే
దివ్యంగా.
-సంకా శోభారాణి.
విజయవాడ.

## పుస్తకం

పుస్తకమొక పువ్వు -
పరిమళాలను వెదజల్లు
పుస్తకమొక నవ్వు -
పండు వెన్నెలలను పరుచు
పుస్తకమొక ధ్వని -
ఆనందాలను పంచిపెట్టు
పుస్తకమొక ఖని -
ఐశ్వర్యాన్ని దోచిపెట్టు
పుస్తకాన్ని అర్థం చేసుకుంటే
పూర్తి జీవితం పండిపోతుంది
పుస్తకాన్ని వ్యర్థం చేసుకుంటే
పూర్తి జీవితం ఎండిపోతుంది
-చింతల శ్రీనివాస గుప్త
9440037125

# శవాలను భుజం మీద మోసే మనుషులు!






- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

మా మెంటార్ అండ్ మిస్టర్ క్లీన్ ఈ వయసులో మీకు రాజకీయాలు, ఫిలాసఫి అవసరం లేదు. అందువల్ల మీరు సుఖంగా వుండజాలరు. వాటి జోలికి పోకండ్రా అని సున్నితంగా మందలించారు కదా. అందుకని షటప్పుయి పోవాలనుకున్నాం. మేం నోళ్ళు మూసుకుంటాం. సోషల్ మీడియా ఆ పని చేయదు కదా. అది అరుస్తూనే వుంటుంది. ఆ అరుపులకు ఎదుటివారు కామ్‌గా వుంటారా? అందుకే షౌటింగ్ చేస్తారు. అవన్నీ ఎంత వద్దనుకున్నా మా దృష్టికి వస్తున్నాయి. అందుకని మా గురువుగారికి క్షమాపణలతో పాదాభివందనం చేసుకున్నాం.

'అప్పుడప్పుడు మా సందేహాలను తీర్చండి' అంటూ?

"ఇప్పుడు మీ సందేహములు ఏమిటి?" అన్నారాయన.

"ఈమధ్య ఎటు చూసినా పే.టి.ఎమ్ కుక్కలు, నక్కలు, సింహాలు, పులులు అని రకరకాల జంతుజాలాల్తో పోల్చుతూ, అన్‌పార్లమెంటరీ లాంగ్వేజ్‌లో తిట్టుకుంటున్నారు. అందులో గతంలో ఘనకీర్తి గాంచిన వారున్నారు. కొత్తగా ఆయుధాలు పోగేసుకుంటున్న వారున్నారు. ఈ అంశం మీద మీరు మాకు కాస్త వివరణ ఇవ్వండి. మార్గదర్శనం చేయండి" అన్నాను.

"అంతేనా?" అన్నాడా యన.

"ఇందులో ఆడా మగా తేడా లేదు. అలా కానివారి తేడా లేదు. ఇలా బూతులు తిట్టడంలోనూ మహిళలు వున్నారు. పురుషులంటే బూతులకు లైసెన్స్ పొందినవారు అని ఇప్పటిదాకా అనుకున్నాను. భగవంతుడు సర్వాంతర్యామి. ఎందెందు వెతికిన అందందు గలడు అంటారు. అది మాకు తెలియదు గాని, ఎందెందు వెతికిన అందందు పచ్చి బూతులు కనిపిస్తున్నాయి. చివరకు పిల్లలకూ ఇవి నేర్పిస్తున్నారు. దీనికి పరిష్కారం ఏదైనా వుందా?" అంది అన్య.

"అవన్నీ కాసేపు పక్కన పెడదాం. పే.టి.ఎమ్ అని అందర్నీ విమర్శిస్తున్నారు. అందులో నిజం ఎంత? ముందు అది క్లారిఫై అయ్యాక మిగతా విషయాల మీద దృష్టి సారిద్దాం" అన్నాడు విదూ.

వాడికి అప్పుడప్పుడు మంచి తెలుగు పదాలు దొర్లుతున్నాయి. గురువుగారి సావాస లాభం అనుకుంటాను. గురూజీ ఆరంభించారు.

"న బూతో న భవిష్యత్తు అన్నారు ఎప్పుడో. అనగా బూతు లేనిదే భవిష్యత్తు కాదు, వర్తమానమే లేదని కవులు, రచయితలు, సినిమా వాళ్ళు, డాక్టర్లు ఎప్పుడో గ్రహించారు. అయితే రాజకీయ నాయకులకు ఇది తెలిసినా కొంతకాలం నిగ్రహించుకున్నారు. మనం వాడుక భాషలో సాహిత్యం సృష్టించాలని ఉద్యమాలు నడిపారు నాయనలారా! వాడుక భాషలో గ్రాంథికంలోలా అనేక బూతులు వున్నాయి. అవి నాచురల్‌గా వుండాలంటే అవన్నీ సాహిత్యంలోకి తీసుకురావాలి అని మరో ఉద్యమం మొదలయింది. అది ఇప్పుడు అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతోంది" అన్నాడాయన.

"ఇది ఇంట్రోనా?" అన్నాను.

"అవును. ఇది చర్చా వేదిక కాదు. ఇక్కడ పేనల్ లేదు. అందుకని నేను సింగిల్‌గా మీ ముందుకు మీరు రమ్మంటే వచ్చాను కాబట్టి ఈ సెషన్ అంతా నాదే. అందుకే మీ చెవులు మాత్రం పని చేయాలి. మధ్యలో ప్రశ్నలు మాత్రమే అడగవచ్చు" అన్నారు మిస్టర్ క్లీన్.

"మీ మీద ఎప్పుడన్నా పే.టి.ఎమ్ డాష్ అనే విమర్శ వచ్చిందా?" అంది అన్య.

"రాలేదు. ఇక ముందు రాదనే గ్యారెంటీ లేదు. అదలా వుంటే మౌనంగా వుండేవారికి–ప్రపంచంలో ఏం జరిగినా మాట్లాడనివారికి ఇలాంటి ఆరోపణలు రావటానికి అవకాశం తక్కువ. ఎందుకంటే మాట్లాడకపోయినా తంటానే."

"అంటే మాట్లాడకపోవటానికీ డబ్బులు ఇస్తారా?" అన్నాను.

"ప్రతిదానికీ అవకాశం వుంది. అది నిర్ణయించవలసింది ఎవరు? పే.టి.ఎమ్ అనగా ఆన్‌లైన్ పేమెంట్. అలా కాకున్నా రకరకాల రూపాల్లో అందుతాయి. అయినా దాన్ని పే.టి.ఎమ్‌గా మనవాళ్ళు స్థిరపరిచారు. ఇంక ఇలాంటి ఆరోపణల్లో నిజం ఎంత అని మీ సందేహం. అంతేనా?"

"అవును" అన్నాం ముగ్గురం ఒకేసారి.

"పిల్లలూ–మనిషికి అంతరాత్మ అని ఒకటి వుంటుంది అంటారు. లోపలి మనిషి అని అంటారని ఇంకొందరి ఉవాఛ. ఇప్పుడు అది వుందా? అంతర్థానం అయిందా? లేక మనుషులు తమ లోపలి మనుషుల్ని మర్డర్ చేశారా అని తేల్చాలి. బయటివారు కాదు సుమా. ఎవరికి వారు. నీ ముఖంలో చిరునవ్వు వుండవచ్చు. రాక్షసత్వం కనిపించవచ్చు. అసలు నీ ముఖమే ఓ ప్రశ్నార్థకం కావచ్చు. నీ ఎక్స్‌ప్రెషన్ ఎలా అయినా వుండవచ్చు.

ఆ రకంగా నువ్వు ప్రపంచాన్ని భయపెట్టవచ్చు. బతిమాలవచ్చు. తికమక పెట్టవచ్చు. నీ గతాన్ని సాక్ష్యంగా పరచవచ్చు. నువ్వు ఏం మాట్లాడినా, మాట్లాడకపోయినా పేమెంట్ అందుతుందా లేదా అనేది నీకు మాత్రమే తెలుసు కదా!"

"ఇచ్చినవారికి కూడా తెలుస్తుంది కదండి" అంది అన్య.

"అది డైరెక్ట్‌గా అందకపోవచ్చు అన్యా! ప్రతిదానికీ మధ్యవర్తులుంటారు. అందులో కొంత భాగం వారు నొక్కవచ్చు. ఇవన్నీ సహజ పరిణామాలు. ఇక్కడ విషయం ఏమనగా నువ్వు ఏ రకమైన పే.టి.ఎమ్ డాష్‌వో నీకు మాత్రమే తెలుసు. అది నీ అంతరాత్మకు తెలుసు. అది చిరంజీవి. నువ్వు ఎన్నిసార్లు దాన్ని మర్డర్ చేసినా, ఎప్పుడో ఒకప్పుడు నీ మనసులో మౌనభంగం జరగగానే తిరిగి అది బతుకుతుంది–బేతాళుడి కథల్లోలా! అందుకని తప్పు చేసినవాడు శవాలను భుజం మీద మోస్తుం టాడు. అతనికి శ్రమ తెలియకుండా కథలు చెబుతుంటుంది. సమాధానం తెలిసి మౌనంగా వుంటే తల వేయి వక్కలవుతుంది కాబట్టి వివ రణ ఇవ్వక తప్పదు. అందుకని శవాలను భుజాల మీద మోసేవారి గురించి మనకు ఎందుకురా? అంతగా అయితే చందమామ పత్రికలో బేతాళ కథలు చదువుకోండి. జ్ఞానం లభిస్తుంది" అన్నారు మిస్టర్ క్లీన్.

అందరం ఒకరి ముఖాలు ఇంకొకరం చూసుకున్నాం.

"ఇంక మార్గం అన్నారు. లోకంలో అనేక మార్గాలున్నాయి. అన్ని మార్గాలు శ్మశానం దగ్గరికే పిల్లలూ. మనుషులు చచ్చేంతవరకూ అబద్ధా లు, బూతులు మాట్లాడతారు.

ఎవరో ఒకరి కొమ్ము కాస్తారు. పే.టి.ఎమ్ వీరులుగా వుంటారు. ఇది మొదట బతుకు తెరువుగా ప్రారంభం అవుతుంది. తర్వాత సెటిల్ కావాలనుకుంటారు. చాలామందికి అది వ్యసనం అవుతుంది. అందువల్ల మళ్ళీ చెబుతున్నాను మీరు ఇలాంటివాటి జోలికి రాకండి. లేదంటే మీరు మీ ఛానల్ రూట్ మార్చండి. మీరు మాట్లాడే ప్రతి మాటకూ డబ్బులు వస్తాయి. వాటికి అలవా టుపడితే భేతాళుడి భుజం మీద శవం మాయం అయినట్లు మీకూ సిగ్గూ, శరం లాంటివన్నీ అంతర్థానం అవుతాయి" అన్నాడు.

అదండి విషయం!




## ఒంటరి అలలా

సంసారం సాగరమైతే
ఈ జీవన పోరాటంలో
నీ గమ్యం చేరాలంటే
ఒంటరి అలలా నీ పయనం
కొనసాగాల్సిందే.
నీ జీవనశైలిలో నీ అనుభవం
ప్రతీ ఆలోచనలోనూ,
ప్రతీ అనుభూతిలోనూ,
ప్రతీ చర్య లోనూ వ్యక్తమవుతుంది.
శరీరం కనిపించే సాధనం ఐతే,
మనసు దానిని నడిపించే అంతర్గత శక్తి.
వేగవంతమైన జీవనశైలిలో
మనిషి విలువలను మరచి
పోతున్నాడు. పుట్టేటప్పుడు
ఒంటరిగా వచ్చిన మనిషి, వెళ్లేటపుడు కూడా ఒంటరిగా
వెళ్లాల్సిందే అన్న సత్యాన్ని
మరచిపోతున్నాడు. తనకు
అతని మనస్సాక్షి మాత్రమే తోడుగా ఉంటుంది.
మనిషి జీవితం ఒక ప్రవాహం
లాంటిది. కోరికల సముద్రంలో
మునిగిపోతే, తన అసలు స్వరూపాన్ని మరచిపోతాడు.
ఈ సృష్టిలో ఏదీ శాశ్వతం కాదు.
ప్రతి వస్తువుకీ, ప్రతి జీవికి ఒక గడువు ఉంది. కొన్ని
క్షణాల్లో
నశించిపోతాయి. మరికొన్ని
యుగాల తర్వాత మాయమవుతాయి. మనిషి
జీవితమూ అంతే. కాబట్టి
ఈ క్షణికమైన జీవితంలో
శాశ్వతమైన విలువలు సంపాదించడం ముఖ్యం.
అవే ధర్మం, సత్యం, నిబద్ధత.
ఇవే మనిషి జీవితాన్ని
అర్థవంతం చేస్తాయి. ధర్మాన్ని అనుసరించిన జీవితం
ఎపుడూ ప్రశాంతతను, సంతృప్తిని ఇస్తుంది.
అది ఒక జీవన తత్వం.

-శ్రీదేవిప్రభాకర్ తంత్రవహి.

## కెరటాలలో ...

కష్ట సుఖాల సమ్మిళితం
జీవితపయనం..
జయాపజయాల కెరటాలలో
తేలియాడుతూ...
మౌనంగా పయనం ముందుకు
సాగించడమే జీవితం....
జీవన సంద్రంలో ఎగిసిపడే
కెరటాలన్నీ తీరం చేరకున్నా..
మరల మరల ఉరకలు వేస్తూ
ఆశలతీరం చేరేవరకూ
ముందుకు సాగడమే
మనిషి కడలి తరంగాల నుండి
నేర్చుకోవాల్సిన జీవితపాఠం...
జీవితనౌకకు ఎదురయ్యే
ఆటుపోట్లు తాత్కాలికమే..
పట్టుదలతో మడమ తిప్పక
చేసే ప్రయత్నం ఇచ్చే ఫలితం శాశ్వతమే...
ఒంటరి అలలా మిగిలిపోక
పడి లేచే కెరటంలా....
మరల మరల ప్రయత్నం సాగిస్తేనే
ఆశయ శిఖరం చేరడం తథ్యం....!!

-లక్ష్మీ పద్మజ దుగ్గరాజు
భాగ్యనగరం

## ఒంటరి అలనై

పూత పూయని మొక్కల్లా
ఎవలో ఒకలు ఎప్పుడూ
నా చుట్టూ ఉండే ఉంటారు
వాళ్ళ కళ్ళెప్పుడు నా వైపు
ఆశగా చూస్తూనే ఉంటాయి
వాళ్ల ఖాళీ చేతులు
ఏదో ఒకటి పొందడానికి
ఆర్తిగా ఎదురుచూస్తుంటాయి.
అవసరం గట్టెక్కిన తర్వాత
గోడెక్కి అటేపు చూస్తుంటారు
నేనే రీఛార్జ్ చేయించిన ఫోన్లు
నాపై ముచ్చట్ల రాట్నాలను
బరాబరా తిప్పేస్తుంటాయి
అన్నింటికి అండగా నిలబడ్డ
నా మీదనే పేక పడుగుల్లా
అటీటు ఆసు పోస్తుంటాయి. .
అందరికీ ఆలంబనగా ఉన్నా బి
నా స్వావలంబనలో ఎవరూ లేక
ఒంటి స్తంభం మేడనై
ఏకాకిలా ఎదురుచూస్తూ నిలబడ్డా
ఆటుపోట్లు ఎన్నెదురైనా
అచంచలమైన విశ్వాసంతో
ఒంటరి అలనై పోరాడుతున్నా.
ఐనా...
తీరం చేరేవరకు విశ్రమించక
ముందుకు సాగుతూనే ఉంటాను
సంకల్పబలంతో సావాసం చేస్తే
ఒంటరి అల కూడా
ఉప్పెనై పోటెత్తుతుంది

-గంగాపురం శ్రీనివాస్(గంగశ్రీ)
9676305949

## ప్రోత్సహించే గురువు

సాగరమనే
లోతైన సంసారంలో
ఎన్ని కష్టనష్టాల...
తుఫానులొచ్చినా
జీవనతీరం చేరుటకు
సాహసమునే ఊపిరిగా
దైర్యమనే తెరచాపతో
ప్రయత్నిస్తూ....
ఎదగడానికి
ఆకాశాన్నందుకొనుటకు
పైకెగిసే కెరటంలా
సంద్రమంటి...
విశాల హృదయం
కలిగి గంభీరంగా
మనిషి ఒంటరి అలలా
జీవన ప్రయాణం
సాగించాలి!!
ఆత్మవిశ్వాసమనే
అలొక్కటి వుంటే చాలు
మనిషి లక్ష్యాన్ని...
అవలీలగా చేరుకోగలడు
ఎగిసిపడే అలల్లా
పడిపోయినా
ప్రతిసారి ప్రయత్నిస్తే
సగం విజయం
పడిపోయినా పట్టుకునే
తండ్రిలా సముద్రుడున్నట్లే
చేసే పనికి వెంట
ప్రోత్సహించే గురువుంటే
అనుకున్నది సాధించగలం!!

-మద్దెల సరోజన (సహజ)




# అభ్యుదయ కవి సి.వి. కృష్ణారావు



వచన కవిత్వంలో అభ్యుదయ భావాలను వెదజల్లిన కవి సి వి కృష్ణారావు వీరు 1926 జులై 3 వ తేదీన సూర్యాపేట జిల్లా రేవూరులో జన్మించారు అభ్యుదయ కవిత్వోద్యమం వెలువడిన తర్వాత కృష్ణారావు వైతరణీ మాదీ మీ ఊరే కావ్యాలు వ్రాశారు.

దళిత జాతుల దీన గాధలు వీరి కావ్య వస్తువులు ఒక్కొక్క నగరం దేహం మీద మానని రాచపుండులాగా పుట్టిన మురికి వాడలో సంచరించి అర్జీ రాసుకోవడానికి ఇళ్ళలో కాగితం కలం కూడా లేక అధికారులకు ఏకల వ్యుని లాగా బొటన వేలు అందించే దీనుల వ్యధా భరితమైన జీవితాలను వీరు తమ కవితా సంపుటిలో వర్ణించారు.

"చిత్తడి నేల మీద చిన్న పూరి గుడిసె ఉప్పులూరి చవుడు రాలి చతికిలబడిన గోడలు" మురికి పేటలా కనిపించే దృశ్యాలు మురికి పేటలు పెరుగుతున్నాయి గానీ ఆ పేట వాసుల జీవితాలలో మార్పు రావటం లేదు వస్తున్న మార్పు మరింత దుర్భర స్థితికి దిగజారటమే

వైతరణి గట్టున విధి తిరస్కరించిన వ్యధా భరిత జీవితాలు కృష్ణారావు గారి కవితలో సజీవ చిత్రాలై సాక్షాత్కరించారు ' వేలు పెట్టి చూపించి తుపాకీ పెట్టి కాల్చడానికి 'ఎద్దుకన్ను ఇంకా అమర్చబడలేదు' అని సమాజం లో విప్లవానికి ఇంకా అనువైన పరిస్థితులు ఏర్పడలేదని వీరు భావిస్తారు వీరు 'అవిశ్రాంతం' అనేమరో కవితా సంపుటిని కూడా వెలువరించారు ఇందులో 'ఏదీ శిశువు?' అన్న కవిత కృష్ణారావు కవిత్వ రచనా సామర్థ్యానికి ఉదాహరణ ఇందులోని 'శాంతిక పోతం'అన్న కవిత మన గుండెను కదిలిస్తుంది

"అయోధ్య అడవికి" అన్న కవితలో పితృ వాక్య పరిపా లనా దక్షతో

**అవతార పురుషుడే**
**అరణ్యవాసం చేశాడు**
**అప్పుడు అడవుల్ని**
**వెన్నాడుకుంటూనే వెళ్ళాం**
**ఇప్పుడూ మనం అడవుల్ని**
**వేటాడుతున్నాం**
**అలాగే 'గాంధీజీ'అన్న కవితలో**
**గాడ్సే గుండె దెబ్బ తగిలిననాడే**
**జీసస్ క్రాస్ కనబడ్డది**
**సోక్రటీస్ చేతిలో**
**హేమ్లక్ పాత్ర కనబడ్డది**
**శిబి కోసిన నెత్తురు కండది**
**నీవు కనబడ్డవు నీ దిటీ కనబడ్డది**

ఇలాగే 'అగ్రగామి అంబేద్కర్ ' వంటి కవితలు ఈ సంపుటిలో శిఖరాయమానమైన కవితలు

వీరి సంపాదకత్వంలో నెల నెలా వెన్నెల కవితల సంకలనాలుగా ప్రచురించి నగరం కవులను ప్రోత్సహించారు ఇంకా వీరు కిల్లారి (1993) వైతరణీ నుంచి రాసస్తూ రాసస్తూ (1969) పుస్తకాలను మహారాజకుమారా అవిశ్రాంతం అనే కవితా సంపుటాలను కూడా ప్రకటించారు

1993 లో లాతూరు భూకంప భాధితులపై 'కిల్లారి' అనేదీర్ఘకవితను వెలువరించారు ఇదంతా ఒకవైపైతే వీరు గొప్ప కథకులు కూడా తోడేలు జగతి భిక్షువు విధ్యాబోధ నోటీసు గీయని అక్షాంశరేఖ తదితర కధలు రాశారు తెలంగాణ సాయుధ పోరాటంపై వీరు రాసిన 'నోటీసు' తొలి కథ1948 జూన్‌లో విశాలాంధ్ర మాస పత్రికలో ప్రచురింపబడింది

ఈ కవి 2019 ఆగష్టు 12 న దివంగతులైనారు

(సి.వి.కృష్ణారావు గారి శత జయంతి సందర్భంగా)



-పున్నమి
9396610639

## ఘంటారావం

అమ్మను అగౌరవపర్చేవారిని
గమనించు
ఎవరికీ గౌరవమివ్వనివారని
గ్రహించు

సుందర కాశ్మీరు
లోయలు
సుజల ధారల
పాయలు.

అజ్ఞానానికి
హద్దులేదు
జ్ఞానానికి
తృప్తి లేదు.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.
ఈ వారం కథల వర్క్ షాప్‌లో విజేత వేలేటి విజయశ్రీ ఒక నీటి చుక్క, రెండు మనసులు కలయిక కథ చదవండి. -సంపాదకులు



-డా॥రావి రంగారావు
9247581825

## ఒక నీటి చుక్క, రెండు మనసులు కలయిక

రామాపురం గ్రామం బయటికి ప్రశాంతంగా కనిపిస్తోంది. కానీ లోపల పాత కక్షలు ఇంకా మంటల్లా రగులుతూనే ఉన్నాయి. రామయ్య కుటుంబం, నరసయ్య కుటుంబం .ఒకే ఊరిలో ఉంటూ, సంవత్సరాలుగా ఒకరినొకరు దూరంగా ఉంటున్నారు. చాలా ఏళ్ల క్రితం పొలానికి సంబంధించిన చిన్న గొడవ, ఇప్పుడు రెండు కుటుంబాల మధ్య అడ్డుగోడలా మారింది. కాలం గడిచింది. కానీ మనసుల్లోని దూరం మాత్రం తగ్గలేదు. పండుగలు వేరు, పనులు వేరు, మాటలు కూడా లేకుండా జీవనం సాగుతోంది. ఒక వేసవిలో గ్రామానికి తీవ్రమైన నీటి కొరత వచ్చింది. బావులు ఎండిపోయాయి. చెరువులు ఖాళీ అయ్యాయి. అందరూ కలిసి ఒక నిర్ణయం తీసుకున్నారు ? "కొత్త బోర్ వేయాలి" అని.

కానీ ఎక్కడ వేయాలి అన్న ప్రశ్న వచ్చేసరికి, పాత కక్షలు మళ్లీ పైకి వచ్చాయి. "మా పొలంలో వేయాలి. అందరికీ సౌకర్యంగా ఉంటుంది," అన్నాడు రామయ్య ధైర్యంగా.

"ఎప్పుడూ మీ మాటేనా? మా వైపునే వేయాలి. మేమూ ఈ గ్రామంలో భాగమే," అని నరసయ్య గట్టిగా అన్నాడు. మాట మాట పెరిగింది. పాత బాధలు, పాత కోపాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. గ్రామ పెద్దలు మధ్యలోకి వచ్చినా, ఎవ్వరూ వినే స్థితిలో లేరు. వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఆ సమయంలో, చిన్నారి లలిత ముందుకు వచ్చింది. ఆమె రామయ్య మనవరాలు. కానీ నరసయ్య మనవళ్లతో కలిసి చదువుతుంది, ఆడుకుంటుంది. "తాతయ్య? నీళ్లు ఎవరి కోసం?" అని ఆమె మెల్లగా అడిగింది. రామయ్య కాసేపు ఆలోచించి, "గ్రామం కోసం?" అన్నాడు. "గ్రామం అంటే మనమంతా కాదా? నేను వాళ్లతో స్కూల్‌కి వెళ్తాను. వాళు నా స్నేహితులు. అయితే మనం ఎందుకు వేరుగా ఉంటాం?" అని లలిత ప్రశ్నించింది. ఆమె మాటల్లో అమాయకత్వం ఉంది. కానీ అది అందరి మనసులను తాకింది. నరసయ్య నెమ్మదిగా ముందుకు వచ్చాడు. "పాప సరిగ్గా చెప్పింది. మనం పోట్లాడేది భూమి కోసం? కానీ జీవించేది మనుషులం," అన్నాడు. రామయ్య తల వంచి నిలబడ్డాడు. కొద్దిసేపటి నిశ్శబ్దం తర్వాత, "ఇక కక్షలు చాలించాలి. బోర్ మధ్యలో వేయండి. అందరికీ ఉపయోగపడాలి," అన్నాడు.

ఆ రోజు మొదటిసారి ఆ రెండు కుటుంబాలు కలిసి పని చేశాయి. బోర్ తవ్వకం ప్రారంభమైంది. బోర్ తవ్వకం జరుగుతున్న రోజుల్లో, గ్రామంలో వాతావరణం నెమ్మదిగా మారింది. ఇంతకాలం ఒకరినొకరు చూసినా మాట్లాడని వాళ్లు, ఇప్పుడు ఒకే చోట కూర్చొని పని గురించి మాట్లాడటం మొదలుపెట్టారు. మహిళలు నీళ్లు తెచ్చే కష్టాలు చెప్పుకుంటూ ఒకరికొకరు సహాయం చేసుకున్నారు. పిల్లలు మాత్రం ఎప్పటిలాగే కలిసి ఆడుకుంటూ, పెద్దల మధ్య ఉన్న గోడలు తమకు తెలియని వన్నట్టు నవ్వులు పంచుకున్నారు. ఆ చిన్న మార్పులే గ్రామంలో పెద్ద మార్పుకి దారి తీశాయి. కొద్ది రోజుల తర్వాత, బోర్ నుంచి నీళ్లు ఎగసి పడినప్పుడు, అందరి ముఖాల్లో ఆనందం మెరిసింది. రామయ్య, నరసయ్య ఒకరినొకరు చూసుకుని చిన్నగా నవ్వుకున్నారు. ఆ రోజు బోర్ నుంచి వచ్చినది కేవలం నీళ్లు కాదు? ఏళ్లుగా మట్టిలో పాతిపెట్టిన కక్షలు కూడా బయటకు వచ్చి, అక్కడే కలిసిపోయాయి. లలిత నవ్వులో, రామాపురం కొత్తగా పుట్టింది.



- వేలేటి విజయ శ్రీ దుర్గ, 9030225437

# క్లిష్టకాలంలో మనుగడ సాగిస్తున్న 'సాహితీకిరణం'

-డా॥ కె.వి.రమణాచారి




పురస్కారాలను ప్రదానం చేస్తున్న ముఖ్య అతిథి డా॥కె.వి.రమణాచారి. వేదికపై వంశీ రామరాజు, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకట దాసు తదితరులు.

హైదరాబాద్, జులై 8:(నేటినిజం ప్రతినిధి):సాహిత్యరంగంలో నిరంతరం కృషి చేస్తున్న సాహితీవేత్తలకు గుర్తింపు అవసరమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా॥కె.వి.రమణాచారి అన్నారు. సాహితీకి రణం 17వ వార్షికోత్సవ వేడుకలు జూన్ 24, 2026 శ్రీ త్యాగరాయ గానసభ సౌజన్యంతో గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డా॥రమణ మాట్లాడుతూ 60,70దశకంలో తెలుగునాట పలు సాహితీ పత్రికలు తమ ఉనికిని గొప్పగా చాటుకున్నాయని, పేరు మోసిన సాహితీవేత్తల రచనలు విస్తృతంగా వచ్చేవని అన్నారు. ఇప్పుడు సాహితీపత్రికలు ఒకటి, రెండు మాత్రమే వస్తున్నాయని, క్లిష్టకాలంలోనూ మనుగడ సాగిస్తున్న పత్రిక సాహితీకిరణం అని ఆయన ప్రశంసించారు. సాహిత్యంకూడా మన జీవిత ంలో ఒక భాగమేనని డా॥రమణ వ్యాఖ్యానిం చారు. సాహితీవేత్త డా॥వై.రామకృష్ణారావు మాట్లాడుతూ... ఎందరో కవులు, కవయిత్రు లు, రచయితలు, రచయిత్రులు తమ తమ రచనలతో తెలుగు సాహిత్య క్షేత్రాన్ని సుసం పన్నం చేశారని అన్నారు. సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు సభను ప్రారంభిస్తూ నేటి సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని చాలామంది యువకవులు, కవయిత్రులు, రచయితలు, రచయిత్రులు సృజనాత్మకమైన రచనలు చేస్తు న్నారని అన్నారు. సాహితీ కిరణం పత్రికను ఇన్నాళ్ళుగా ఆదరిస్తున్న పాఠకులకు, రచయిత(త్రు)లకు, ప్రకటనదారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ సభలో శిరోమణి వంశీ రామరాజు, రచ యిత్రి, సాహితీ కిరణం మేనేజర్ పొత్తూరి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కవి పెద్దూరి వెంకటదాసు కార్యక్రమ నిర్వాహకుడుగా వ్యవహరించారు. ఇదే సభలో పింగళి కమలాకేసరి నెలకొల్పిన డా॥పింగళి జగన్నాధరావు స్మారక సాహిత్య పురస్కారం– కవి,రచయిత, గాయకుడు చిమ్మపూడి శ్రీరామమూర్తికి, సిరిగాద శంకర్ నెలకొల్పిన సిరిగాద నర్సయ్య స్మారక సాహిత్యపురస్కారం– కవి,రచయిత వైరాగ్యం ప్రభాకర్‌కు, సిరిగాద బాలమ్మ స్మారక సాహిత్య పురస్కారం– సినీ, వ్యాస రచయిత్రి సి.వి.ఆర్. మాణిక్యేశ్వరికి సభలో పాల్గొన్న డా॥రమణ తదితరులు కలిసి ప్రదానం చేశారు. ముట్నూరి కమలమ్మ ఫౌండేషన్ సాహితీకిరణం సౌజన్యంతో నిర్వహించిన చిన్నకథల పోటీల విజేతలైన కొండూరి కాశీవిశ్వేశ్వరరావు, ఆకెళ వెంకటసుబ్బలక్ష్మి, బండారి రాజ్‌కుమార్‌లకు ఈ సభలో బహుమతు లను స్వీకరించారు. సభకు ముందు కోమల సమన్విత కూచిపూడి నృత్యాలయంకి చెందిన పలు వురు బాలనర్తకీమణులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు నృత్యప్రియులను ఆకట్టుకున్నాయి.



సదానందం. తండ్రి పేరు శివయ్య, తల్లి పేరు కమలమ్మ.

తండ్రి వృత్తి వడ్ల పని. వడ్లంగం. ఇప్పటి భాషలో కార్పెంటర్.

శివయ, కమలమ్మ దంపతులకు పోగా మిగిలినవాళ్లు సదానందం, లక్ష్మి .

లక్ష్మికి పన్నెండేళ్లకే పెళ్లి చేశాడు శివయ్య.

పదకొండో తరగతిలో సదానందుకు పెళ్లయింది.

సదానందం పన్నెండో తరగతి ఫెయిల్.

సదానందంతో పాటు ఫెయిలయిన నారాయణ ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో ఎన్.ఎమ్. ఆర్. గా పని దొరికించుకున్నాడు. ..బుచ్చన్న ఆర్టీసీ లో చేరాడు.

ఎతిరాజం సినిమా టాకీస్‌లో సినిమా ఆపరేటర్.

సత్యనారాయణ సినిమా టాకీస్ ఎదురుగా రోడ్డు మీద చాయ్ డబ్బా.

సుధాకర్ బట్టల షాపులో! రాజనారాయ్య బీడీల కంపెనీలో!

ఫెయిలయిన వాళ్లు తలా ఒక పనికి కుదురుకున్నారు తప్పలేదు.

పన్నెండో తరగతి పాసైనోళ్లందరూ డిగ్రీలో చేరలేదు.

సగం మంది ఏదో పనిలో పడ్డారు.

కటేశ్వర్ టీచర్ ట్రైనింగ్‌లో చేరాడు.

రాజిరెడ్డి వ్యవసాయం. లక్ష్మీకాంతకు పోస్టాఫీసులో ఉద్యోగం.

లక్ష్మీనరసయ్య మిలిటరీలో. ముగ్గురు సింగరేణిలో బొగ్గు గని కార్మికుల య్యారు. పాసైన వాళ్లల్లో కొద్దిమందే డిగ్రీ లో చేరారు. పన్నెండో తరగతి ఫెయిలయిన సదానందుకు మళ్లీ పరీక్షలు రాయాలని పించలేదు. శివయ్య తనకు తెలిసిన వాళ్లను బతిమి




లాడితేఎస్.ఆర్.ఎస్.పి. లో ఎన్.ఎమ్. ఆర్. గా తాత్కాలిక పని దొరికింది.

ఎస్.ఆర్.ఎస్.పి. అంటే శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్.

తొలి రోజుల్లో దీని పేరు పోచంపాడు ప్రాజెక్ట్.

1978లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక,

దీని పేరు శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్‌గా మార్చారు.

నెహ్రూ ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశాడు.

ఆ దీవెనలతో వేలాది మందికి రకరకాల ఉద్యోగాలు, పనులు దొరికాయి.

ఎందరో ఇంజనీర్లయ్యారు. ఎందరో సూపర్‌వైజర్లయ్యారు.

కాంట్రాక్టర్లయ్యారు.

కాలువ కింద కొంతమంది భూములు కోల్పోయారు.

కాలువ వెంబడి కొన్ని రోడ్లు పుట్టుకొచ్చాయి.

పాలమూరు లేబర్ పెరిగింది.

లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చాయి.

గోదావరి కాలువ పొడుగునా ఉన్న గ్రామాల్లో,కిరాణా షాపులు పెరిగాయి. జనరల్ స్టోర్స్ పెరిగాయి.

మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల నీళ్ల కరవు తీరింది.

అవి బిజినెస్ సెంటర్లుగా ఎదిగాయి. ట్రాక్టర్ల రాక మొదలైంది.

మంగళూరు పెంకుటిళ్లకు బదులు డాబా ఇళ్లు కడుతున్నారు.

విద్యానగర్, కృష్ణానగర్, వాణీనగర్ పెరిగాయి.

ధరూర్ క్యాంప్ జగిత్యాలలో కలిసిపోయింది.

చెరువులు నిండుతున్నాయి. కాలువలు పారుతున్నాయి.

పంటలు పండుతున్నాయి.

ఒక కాలువ ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం వైపు వెళ్తుంది.

ఒక కాలువ కరీంనగర్ వైపు,జగిత్యాల నుండి కరీంనగర్ దాటి, హన్మకొండ మీదుగా, ప్రధాన కాలువ వరంగల్ దాకా సాగింది.

దానికి కాకతీయ కాలువ అని పేరు పెట్టారు.

కరీంనగర్ దాటగానే శాతవాహన సామ్రాజ్యం పేరు మరిచిపోయారు.

కాకతీయ కాలువ అని పేరు పెట్టుకున్నారు.

చెరువుల్లో, కాలువల్లో ఎన్ని నీళ్లు ఉంటే ఏంటి?

భూములు ఉన్నోళ్లకే పంటలు పండాయి. భూమి లేనోళ్ల సంగతి ఏంటి?

మన నీళ్ల కుండ మన పొలం. ఎన్ని నీళు ఉంటే అంత ఐశ్వర్యం.

శివయ్యకు భూమి లేదు . సదానందం చదువు చిన్నది.

భూమిలేని సదానందం తాత్కాలిక కూలీ అయ్యాడు.

అదే సదానందం నుదుటి రాత అయింది.

శ్రీరాం సాగర్ కాలువ లాగే సదానందం జీవితం సాగింది.

జనాల్లో గోదావరి కాలువ చైతన్యమై పారింది.

పాడుబడ్డ భూములు, బంజరు భూములు మనవే అన్నారు.

భూస్వాములు గుంజుకున్న భూములు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆ చైతన్యం జగిత్యాల జైత్రయాత్రగా ప్రజాప్రవాహమైంది.

గోదావరి కాలువ ఎక్కడ తడిపితే,అక్కడ భూమి పచ్చబడింది.

గ్రామం ఎర్రబడింది. ప్రజల రక్తంతో ఊళ్లు నెత్తురోడాయి.

పచ్చని పొలాల్లో చిచ్చు రేగింది. కొందరు భూస్వాములు ఊళ్లు విడిచి వెళ్లారు.

కొందరు యువకులు ఊళ్లు విడిచి గల్ఫ్ బాట పట్టారు.

కొందరు అడవి బాట పట్టారు. చాలా విచిత్రం.

కాలువ వస్తే ఒకవైపు అభివృద్ధి, మరో వైపు పోరాటాలు, ఉద్యమాలు, ఆంక్షలు.

శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ కాలువ ఆఫీసులు జగిత్యాల కేంద్రంగా ఉన్నాయి.

సదానందం మొదట వర్క్ చార్జ్ ఉద్యోగి.

తోటివాళ్లు పరీక్ష రాస్తుంటే తను కూడా ఆ ఒక్క ఇంగ్లీష్ పేపర్ రాసి పాసయ్యాడు.

పన్నెండో తరగతి కంపార్ట్‌మెంట్‌గా పాసయ్యాడు.

ఇక ప్రమోషన్లకు అడ్డంకి తొలగింది.

కొన్నేళ్లకు సదానందం వర్క్ ఇన్‌స్పెక్టర్ అయ్యాడు.

జగిత్యాల నుండి మెట్‌పల్లి, కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం

క్యాంపులకు సదానందం డ్యూటీ మీద తిరిగాడు.

ఎస్.ఆర్.ఎస్.పి. కాలువ పొడుగునా సదానందం నీడ పడుతుంది.

సదానందం భార్య పేరు గోదావరి.

పదమూడేళ్ల వయసులో సదానందంతో పెళ్లయింది.

పైడిమడుగు గ్రామంలో ఐదో తరగతి దాకా చదువుకుంది.

ఆ తర్వాత కులవృత్తి ప్రకారం బీడీలు చుట్టడం.

మంచి బీడీలు చుడుతుందని కమలమ్మ మెచ్చి కోడలిగా తెచ్చుకుంది.

సదానందుకు ఇద్దరు పిల్లలు. కొడుకు పెద్దవాడు.

కొడుకు పేరు దేవేంద్రనాథ్, కూతురు నర్మద.

సదానందం మొదటి ఉద్యోగం జగిత్యాలలో.

పైడిమడుగు అమ్మమ్మగారింట్లో దేవేంద్రనాథ్ పుట్టాడు.

గోదావరి పురాణిపేటలో అద్దెకు దిగిన ఇల్లు పాత చుట్టాలది.

అందుకే అక్కడి నుండి మారలేదు. కోరుట్ల క్యాంపులో పని చేస్తుండగా నర్మద పుట్టింది.

మల్లాపూర్‌లో పని చేస్తుండగా దేవేంద్రనాథ్, “నాన్నా, సైకిల్” అన్నాడు.

సదానందం, ‘‘వచ్చే క్యాంపులో’’ అన్నాడు.

ఇబ్రహీంపట్నం క్యాంపుకు తిరుగుతూ తిరుగుతూ ఆఖరికి సైకిల్ కొన్నాడు.

ధర్మపురి క్యాంపులో సదానందం పని చేస్తుండగా చలికాలం.

శివయ్యకు ఆయాసం ఎక్కువైంది. దట్టమైన పొగమంచు. ఊపిరి ఆడలేదు.

సదానందం అప్పులు చేసి మందులు తెచ్చాడు. కానీ శివయ్య కన్నుమూశాడు.

శివయ్యతో పాటు రెండు వేల ఏళ్లు సాగిన తరతరాల కులవృత్తి తరం పోయింది.

దినవారాల ఖర్చులకు 13 రోజుల అప్పు.

శివయ్య భార్య కమలమ్మ, “ దేవుడా , నన్నూ తీసుకపో” అని రోజూ ఏడ్చేది.

రాయికల్ క్యాంపుకు సదానందం తిరుగుతున్నప్పుడు దేవేంద్రనాథ్ ఇంటర్‌లో ఉన్నాడు.

కాలేజీ తరపున పిక్నిక్ అన్నాడు. ఎడ్యుకేషనల్ టూర్ అన్నాడు.

ఎమ్‌సెట్ కోచింగ్ అన్నాడు. సదానందుకు, కొడుక్కు గొడవలు, వాదనలు.

సదానందం రెండు రోజులు అన్నం ముట్టలేదు.

”సర్లే నాన్నా, నేను జగిత్యాల ప్రభుత్వ కాలేజీలోనే చదువుకుంటా” అన్నాడు దేవేంద్రనాథ్.

సదానందం కళ్లల్లో నీళ్లు కనపడనీయలేదు.

సారంగాపూర్ క్యాంప్. నర్మద పదో తరగతి.

ఆమె ఎక్స్‌కర్షన్ అడగలేదు.అన్నయ్యకు ఎదురైన అనుభవం ఆమెకు తెలుసు.

తనకు “జ్వరం” అని అబద్ధం చెప్పి ఇంట్లోనే ఉండిపోయింది.

సదానందం ఆ రోజు కూడా అన్నం తినలేదు.

బుగ్గారం క్యాంప్ చుట్టూ తిరుగుతున్నప్పుడు, చెల్లెలు లక్ష్మి మొగుడితో దెబ్బలాడి ఇద్దరు పిల్లలతో వచ్చేసింది.

శాశ్వతంగా వచ్చేసింది.

రెండు కుటుంబాలకు తనే ఏకైక పెద్ద దిక్కయ్యాడు.

లక్ష్మి బీడీలు చుడుతుంది. సదానందం భార్య గోదావరి బీడీలు చుడుతుంది.

హైస్కూల్‌లో చదువుకుంటూనే నర్మద బీడీలు చుట్టడం నేర్చుకుంది.

మొగుడిని వదిలేసిన లక్ష్మికి జీవితం మీద ఆశ ఉంది.

పిల్లలను బాగా చదివించాలనే ఆశ.

ఈ బీడీలు చుడితేనే సరిపోదు అనుకుంది.

తానేదైనా చదువుకోవాలి అనుకుంది.

”అన్నయ్యా, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చేస్తే, ఉద్యోగం వచ్చినా ఆసరా అవుతుంది కదా” అంది లక్ష్మి.

సదానందం ఫీజులు కట్టాలి. పుస్తకాలు కొనాలి.

పిల్లలు పెరుగుతున్నారు. రెండు కుటుంబాలు పెరుగుతున్నాయి.

శ్రీరాం సాగర్ కాలువ నీళ్లతో పంటలు బాగా పండుతున్నాయి.

కాలువ నీళ్లు అందని వాళ్లు మామిడి తోటలు పెడుతున్నారు.

కాలువ నీళ్లతో కోరుట్లకు మంచి నీళ్ల కరవు తీరింది.

కోరుట్లకు పిల్లను ఇవ్వమన్న వాళ్లుకూడా కోరుట్లకు వచ్చి బతుకుతున్నారు.మెట్‌పల్లి, కోరుట్ల, రాయకల్, జగిత్యాల, ధర్మపురి ప్రాంతాలు.

పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి.

ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసిన నెహ్రూను అందరూ మరిచిపోయారు.

# గోదావరి కాలువ.. నాన్న- చెప్పని కథ



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
బీసీ కమిషన్ తొలి ఛైర్మన్,
తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

శివయ్యను కూడా క్రమంగా మరిచిపోతున్నారు.

సదానందం అప్పు చేసిన విషయం చెల్లెకు చెప్పలేదు.

అప్పులవుతున్నాయని గోదావరికి తెలుసు.

ఈ లోపు సదానందం తల్లి కమలమ్మ తనువు చాలించింది.

అంత్యక్రియలు, పెద్ద కర్మలు. మరి కొన్ని అప్పులు.

శివయ్య పోయినా శివయ్య ఎప్పుడో ఊరి బయట కొన్న ప్లాటు మిగిలిపోయింది.

అమ్మ ఉన్నంత కాలం అమ్మనివ్వలేదు.

242 గజాలు. రెండు గుంటలు. ఊరు పెరిగింది. ధర పెరిగింది.

అది అమ్మితే డబ్బులు బాగానే వచ్చాయి.

అలా అందరూ శివయ్యను గుర్తు చేసుకున్నారు. కాస్త ఆర్థిక బాధలు తీరాయి.

సదానందం తన భార్య గోదావరితో పాటు,

చెల్లెలు లక్ష్మికి చేరో పట్టుచీర కొన్నాడు.

”ఇన్నేళ్లకు ఇప్పుడు పట్టుచీర. ఎందుకండి?”

అంటూనే గోదావరి చీరను గుండెకు హత్తుకుంది.

“మనకు కాదండి, నర్మద పెళ్లికి దాచుకోండి” అని ఏడ్చింది.

సదానందం ఆమె కన్నీళ్లు తుడిచి “నువ్వు నవ్వితేనే నర్మద పెళ్లి” అన్నాడు.

లక్ష్మి సంతోషించింది.

దేవేంద్రనాథ్‌కు స్కూటర్ కొనాల్సిన టైంలో కొత్త సైకిల్ కొనిచ్చాడు.

లక్ష్మికి డిగ్రీ ఫీజు కట్టాడు. “చదువుకోవే” అన్నాడు.

సదానందం బిడ్డ నర్మద మొహం వాడిపోయి ఉంది.

నర్మదకు చెవి కమ్మలు చేయించాడు.

పెళ్లి కోసమని రెండు తులాల బంగారం కొన్నాడు.

”కొన్ని నర్మద పెళ్లికి దాచాను” అని భార్య గోదావరితో గుసగుసగా చెప్పాడు.

అది చెవిన పడిన నర్మదకు ఆ రోజు సంతోషంతో నిద్ర పట్టలేదు.

భూమయ్య ఇలా మోసం చేస్తాడని కోరలేదు సదానందం.

కొడుకుకు యాక్సిడెంట్ అయింది నిజమే.

డబ్బు చాలా అవసరం. సదానందం కరిగిపోయాడు.

ఎవరికైనా ఆపద, బాధ ఒకటే అనుకున్నాడు.

దాచిన డబ్బులో సగం విత్ డ్రా చేసి ఇచ్చాడు.

నెలకిస్తానన్న డబ్బులు ఆరు నెలలైనా రాలేదు.

గోదావరి “వద్దండి” అని బతిమాలింది. వినలేదు.

తప్పు చేశాననుకున్నాడు సదానందం.

సదానందుకు దెబ్బ మీద దెబ్బ.

నెలకు 2,000 చిట్టీ. 20 నెలలు. 19వ నెలలో ఎత్తాడు. 40,000 రావాలి.

చిట్టీవాడు 20,000 ఇచ్చి “మిగతా వచ్చే నెల అన్నా” అన్నాడు.

ఆ వచ్చే నెల 8 నెలలైనా రాలేదు. “లాస్ అన్నా” అన్నాడు.

ఆఫీసులో ప్రమోషన్ల హడావిడి.

ప్రమోషన్ కోసం సదానందం తెగ ప్రయత్నం. లింకు దొరికింది.

దానితో జీవితం సెటిల్ అవుతుంది అనుకున్నాడు సదానందం.

పై ఆఫీసర్ మామూళ్లు. ఏడాదిన్నర జీతం ఎంత వస్తుందో అంత మామూలు.

”అన్నీ వాళ్ల బొంద మీద పోస్తే ఏడాదంతా ఎట్లా బతుకుతాం” అంది గోదావరి.

ఆయనకు ముట్టిందేంతో గానీ సదానందం దాచిన డబ్బుతో సహా ఖర్చయ్యాయి.

గోదావరి ‘‘వద్దండి, నిజాయితీగా బతుకుదాం” అంది.

కానీ ఆఫీసులో కుర్చీలో దర్జాగా కూర్చునే పోస్టు.

చాలా కష్టాలు తీరుతాయి అని సాహసం చేశాడు.

కుర్చీ వచ్చింది. కానీ రాత్రి నిద్రలో లంచం ఇచ్చిన చేతులు

వాసన వస్తున్నట్టు కలలు వచ్చేవి. గోదావరి మొహం చూస్తే సిగ్గేసేది.

రెండేళ్లకు అప్పుల నుండి బతుకు కాస్త తేలికపడింది.

చెల్లెలు లక్ష్మి పిల్లలు ఎదుగుతున్నారు.

రెండు కుటుంబాలకు ఒకటే జీతం సర్దుకోవాలి.

బావ అనధికారికంగా మరో పెళ్లి చేసుకున్నట్టు తెలిసింది.

ఇప్పటి భాషలో సహజీవనం. లివ్ ఇన్.

చెల్లెలు లక్ష్మికి తెలిసిందో లేదో తెలియదు.

సదానందం తన నోటితో చెప్పదలచుకోలేదు.

లక్ష్మి ప్రైవేటు స్కూల్‌లో పని వెతుక్కుంది.

తండ్రి పోయాక తండ్రిగా అన్నయ్యే కదా పెద్ద దిక్కు.

పైగా నాన్న సంపాదించిన ఆస్తిలో చెల్లెకు కూడా వాటా వస్తుంది కదా.

ఆ మాట చెల్లె నోటి నుండి అనిపించుకోవడం సదానందుకు ఇష్టం లేదు.

పిల్లలకు మేనమామగా ఏ లోటూ లేకుండా చూసుకున్నాడు.

తన పిల్లలకు కొని, చెల్లె పిల్లలకు కొనకుండా ఏ నాడూ లోటు చేయలేదు.

నలుగురు తన పిల్లలే అనుకున్నాడు.

గోదావరి కూడా ఆడపడుచును గౌరవంగానే చూసింది.

సదానందం డైరీలో అప్పుడప్పుడు రాసిన అప్పుల లెక్కలు,

కష్టాలు చూస్తుంటే దేవేంద్రనాథ్...

”నాన్న ఇన్ని బాధ్యతలు, కష్టాలు... ఎట్లా నెట్టుకొచ్చాడో” అనుకున్నాడు.

జగిత్యాల క్యాంపులో ఉన్నప్పుడు దేవేంద్రనాథ్ డిగ్రీ అయింది.

తొలుత ప్రైవేట్ కంపెనీలో చిన్న ఉద్యోగం.

తర్వాత పీజీ చేశాడు. పార్ట్ టైం లెక్చరర్‌గా చేరాడు.

గవర్నమెంటు కాలేజీలో కాంట్రాక్టు లెక్చరర్‌గా మారాడు.

ఏనాటికైనా పర్మనెంట్ ఉద్యోగం రాకపోతుందా అని ఆశ.

ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ తన మొదటి జీతం

నాన్న చేతిలో పెట్టినప్పుడు... అమ్మ, నాన్నల కళ్లు చూడాలి.

సదానందం డబ్బు ముట్టుకోలేదు. కొడుకు చేతిని ముద్దు పెట్టుకున్నాడు.

”నా కొడుకు సంపాదించేవాడయ్యాడు.”

ఒక బరువు తగ్గింది. ఒక ఆదాయం పెరిగింది.

వాళ్ల కళ్లలో అవి ఆనంద బాష్పాలో... కష్టాలు గుర్తొచ్చిన కన్నీళ్లో...

దేవేంద్రనాథ్‌కు అర్థం కాలేదు.

ఆరు నెలల తర్వాత

”నాన్నా, ఇక నుంచి నెల సరుకులు నేనే తెస్తా!” అన్నాడు దేవేంద్రనాథ్.

”నాన్నా! అమ్మా! మీకేం అవసరం పడ్డా ఖాతా మీద తెచ్చుకోండి.

మా ఫ్రెండ్ షాపులో ఖాతా పెట్టాను, తెచ్చుకోండి” అన్నాడు.

ఆ మాటతో కళ్లు ఆనందంతో మెరిశాయి.

సదానందుకు ఉద్యోగం నుండి రిటైర్ అయినంత రిలీఫ్ ఫీలయ్యాడు.

ఇక తన జీతం బిడ్డ పెళ్లి కోసం పొదుపు చేయాలనుకున్నాడు సదానందం.

నర్మద అప్పుడే పెళ్లి వద్దంటూ హైదరాబాద్‌లో ఎమ్.బి.ఎ. లో చేరింది.

ఆమెను వద్దనడానికి నోరు రాలేదు.

దేవేంద్రనాథ్ సెకండ్ హ్యాండ్ స్కూటర్ కొనుక్కున్నాడు.

సదానందం చెల్లెలు లక్ష్మి దేవేంద్రనాథ్‌కు మేనత్త అవుతుంది కదా.

మేనత్త లక్ష్మి కొడుకు శ్యాంసుందర్ “బావా! నాకు సైకిల్ కొనియ్యి!

ఎల్లుండి నా బర్త్ డే” అన్నాడు.

నిజమే, వాడు కూడా పెరుగుతున్నాడు. సైకిల్ కొనాలి.

తాను చిన్నప్పుడు నాన్నను సైకిల్ కొనిమ్మన్నప్పుడు ఎంత సంఘర్షణ జరిగిందో!

దేవేందర్ సైకిల్ అడిగాడు. నాన్న లేదన్నాడు.

’’సైకిల్ కొనడం కూడా చేతకాదు. చేతకానివాళ్లు ఎందుకు కన్నారు?” అన్నాడు దేవేంద్రనాథ్.

పని చేస్తున్నదల్లా అమ్మ పరిగెత్తుకొని వచ్చి చెంప చెళ్లుమనిపించింది.

”నాన్నను చీరుక తినురా! . నీకు చదువెందుకురా!

ఎక్కడైనా జీతం ఉండుపో!’’ అని అరిచింది. ఆ తర్వాత ఏడ్చేసింది అమ్మ.

”ఊరుకోవే! దోస్తులందరూ సైకిల్ మీద తిరుగుతుంటే వాడడిగాడు.

వాడిదేం తప్పు. కొనివ్వలేని మనది తప్పు” అన్నాడు నాన్న.

అప్పటికే శివయ్య తాతకు నెలనెలా మందుల బిల్లు కట్టలేక అప్పులవుతున్నాయి.

ఆ రోజు రాత్రి నాన్న తినలేదు.

ఇప్పుడు శ్యామ్ తనను అడిగాడు.

తండ్రి అయితేనే తప్ప తన తండ్రి పడ్డ కష్టాలు తెలియవు అనుకున్నాడు దేవేంద్రనాథ్.

శ్యాంను అత్తనే అడుగుమని పంపి ఉంటుంది.

ఎలాగోలా సైకిల్ కొని ఇచ్చాడు దేవేంద్రనాథ్.

సదానందంకు చాలా సంతోషం కలిగింది.

తాను కొడుక్కి సైకిల్ కొనిమ్మన్న నాటి సంఘర్షణ గుర్తుకు వచ్చింది.

పరిస్థితి మునుపటి అంత అధ్వాన్నంగా లేదు అనుకున్నాడు సదానందం.

దేవేంద్రనాథ్‌కు పెళ్లి చేయాలి అంది తల్లి గోదావరి.

అవును, చేయాలి అన్నాడు సదానందం.

’’నాన్న ఇదొక్కటి మాత్రం వెంటనే ఒప్పుకున్నాడు” అనుకున్నాడు దేవేంద్రనాథ్.

నర్మదకు ముందు చేస్తే మంచిది అని తల్లి మనస్సులో ఆలోచన.

”నాకు ఇప్పుడే పెళ్లి వద్దు” అంది నర్మద.

”ఉద్యోగం వచ్చేదాకా చేసుకోను” అంది.

సదానందం, గోదావరి మంచి సంబంధం చూశారు.

దేవేంద్రనాథ్ పెళ్లయిపోయింది.

పార్ట్ టైం లెక్చరర్‌గా పని చేస్తున్న తనూజ కోడలును చూసి గోదావరి మురిసిపోయింది.

మూడు నెలలకు వాళ్ల సంసారం వేరైపోయింది.

కరీంనగర్‌కు మకాం మార్చారు.

సదానందం ఆరోగ్యం బాగుండటంలేదు. గోదావరి ఆరోగ్యం అంతంతే.

మంచిగున్నప్పుడే బిడ్డ పెళ్లి చేయాలనుకున్నాడు.

నర్మద తనకు మంచి ఉద్యోగం వచ్చాక అని వాయిదా వేసింది.

సదానందం రిటైరయ్యాడు.

పెన్షన్ డబ్బులు, అవీ ఇవీ కలిసి మంచిగానే వచ్చాయి.

నర్మద పెళ్లి చేయాలనుకున్నారు. “నేను చేసుకోను” అంది నర్మద.



వాదన పెరిగింది.

”శివయ్య తాతకు పదమూడేళ్లకైంది.

నానమ్మకు అప్పుడు తొమ్మిదేళ్లు.

అమ్మకు నీకు పెళ్లయినప్పుడు అమ్మకు పదమూడేళ్లు.

అన్నయ్యకు 25 ఏళ్లకు పెళ్లయింది. అయితే ఏమిటట?

నేను చేసుకోను” అని నర్మద ఎదురు తిరిగింది.

”నేను కరీంనగర్‌లో ఒక ఫ్లాట్ కొంటాను.

నర్మద పెళ్లి అప్పుడు ఆమె వాటా ఇచ్చేస్తాను” అన్నాడు దేవేంద్రనాథ్,

తన సొంత భవిష్యత్తు కోసం ఆ పెట్టుబడిని వాడుకోవాలనే స్వార్థంతో.

ఇస్తే ఓ బాధ. ఇవ్వకపోతే ఓ బాధ.

”సరే, ఇవ్వు” అంది చివరికి గోదావరి.

ఆ నెపంతోనైనా కొడుకు తమకు దగ్గరగా ఉంటాడనే ఆశతో.

దేవేంద్రనాథ్ కరీంనగర్‌లో పెద్ద ఇల్లు కట్టుకున్నాడు.

సదానందం, గోదావరి ఆ ఇల్లు చూసి మురిసిపోయారు.

కానీ ఆ ఇల్లే తమ మధ్య మానసిక దూరాన్ని పెంచుతుందని వారు ఊహించలేదు.

దేవేంద్రనాథ్ దంపతులు అమ్మనాన్నలకు,

మేనత్త లక్ష్మికి, వాళ్ల పిల్లలకు, నర్మదకు అంతటికీ కొత్త బట్టలు పెట్టారు.

పాదాలకు మొక్కి దీవెనలు తీసుకున్నారు.

కానీ ఆ తర్వాత, తన సొంత పట్టణ జీవితంలో, హోదాలో మునిగిపోయిన దేవేంద్రనాథ్... కుటుంబ బాధ్యతలను విస్మరించి క్రమంగా జగిత్యాలకు రావడం పూర్తిగా మానేశాడు.

సదానందుకు నెలనెలా పెన్షన్ వస్తున్నది.

నర్మద హైదరాబాద్‌లో తన ఖర్చుల మేరకు సంపాదించుకుంటున్నది.

లక్ష్మి ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నది.

ఇంట్లో ఇద్దరు మిగిలారు. సదానందం, గోదావరి.

అప్పుడప్పుడు నర్మద ఫోన్ చేస్తుంది. దేవేంద్రనాథ్ అదీ లేదు.

”ఢిల్లీలో ఐ.ఎ.ఎస్. కోచింగ్ పోతా” అంది నర్మద.

”మంచిది. పో నర్రూ” అన్నారు.డబ్బులు అడిగింది నర్మద.

”లేవు” అన్నాడు సదానందం.

”నా పెళ్లి డబ్బులు, నీ పెన్షన్ డబ్బులు ఇవ్వు” నిలదీసింది నర్మద.

”అవన్నీ వాడు తన కొత్త ఇంటి కోసం పట్టుకుపోయాడు.

అన్నను అడుగు పో” అన్నాడు సదానందం.

”నాకు సగం డబ్బులు రావాలి. నన్ను అడిగి ఇచ్చావా?

నువ్వే అడిగి ఇవ్వు” నర్మద లొల్లి.

సదానందుకు ఛాతీ నొప్పి. దేవేంద్రనాథ్‌కు గోదావరి ఫోన్ చేసింది.

”నేను ఈ ఇంటి కోసం చేసిన బ్యాంకు అప్పు కిస్తీలు కడుతున్నాను.

ఇప్పుడు మాకే బతకడం కష్టంగా ఉంది” అన్నాడు .

గోదావరికి దుఃఖం వచ్చింది.

కొడుకు ఇంత కఠినంగా మాట్లాడాడని గోదావరి సదానందానికి చెప్పలేదు.

”సరే! నాకు పెళ్లి చేయండి. ఢిల్లీకి పోను” అంది నర్మద.

సదానందం గుండెల్లో రాయి పడింది.

మూడో రోజు అకస్మాత్తుగా పడిపోయాడు సదానందం.

కార్డియాక్ అరెస్టు అన్నారు.

దేవేంద్రనాథ్ భార్య తనూజతో సహా వచ్చాడు.

లక్ష్మి బాగా ఏడ్చింది. గోదావరి పరిస్థితి చెప్పే పని లేదు.

సదానందం అంత్యక్రియలు ముగిశాయి.

అన్నింటినీ సదానందం చెల్లెలు లక్ష్మి చూసుకుంది.

ఇంట్లో పాత కుర్చీలో సదానందం ఫోటో ముందు నూనె దీపం వెలుగుతున్నది.

జనం ఒక్కొక్కరుగా పలకరింపులు ముగించుకుని వెళ్లిపోతున్నారు.

కర్మకాండలు అయిపోయాయి.

అమ్మకు గాజులు, బొట్టు తీసేయబోతే నర్మద అడ్డుకుంది.

ఆ పాత ఇల్లు ఒక పెద్ద నిశ్శబ్ద సముద్రంలా మారిపోయింది.

ఇన్నాళ్లూ నాన్న శ్వాసతో, ఆయన దగ్గుతో,

సదానందం నడకతో జీవకళ ఉట్టిపడిన

ఆ ఇంట్లో ఇప్పుడు కేవలం శూన్యం మాత్రమే తాండవిస్తోంది.

అరుగు మీద సదానందం కూర్చునే పాత ఈజీ చైర్ ఖాళీగా పడి ఉంది.

దాని పక్కనే నాన్న వాడే కర్ర గోడకు అనుకుని ఒంటరిగా నిలబడింది.

ఇంటి ముందరి వేపచెట్టు గుండా వీస్తున్న గాలి కూడా

ఏదో శోకాన్ని మోసుకొస్తున్నట్టుగా మూలుగుతోంది.

పొయ్యి వెలగని ఆ వంటగది, దిక్కులు చూస్తున్న గోడలు...

అన్నీ సదానందం లేడనే నిజాన్ని మోస్తూ ఘనీభవించిపోయాయి.

గోదావరి ఒక మూల కూర్చుని,

శూన్యంలోకి చూస్తూ కన్నీరుమున్నీరుగా ఏడుస్తోంది.

ఆవిడ కళ్లల్లో భర్తను కోల్పోయిన దుఃఖం కంటే,

ఆయన బతికున్నప్పుడు తాము అందించలేకపోయిన

సంతోషాల గురించిన గుబులే ఎక్కువగా కనిపిస్తోంది.

నర్మద అమ్మను ఓదారుస్తూ నిశ్శబ్దంగా కన్నీళ్లు పెట్టుకుంటోంది.

దేవేంద్రనాథ్ మనసులో ఏదో తెలియని అశాంతి,

తప్పు చేశాననే భావం అతడిని లోలోపల తొలిచేస్తున్నాయి.

ఆ ఇంట్లోని ప్రతి వస్తువూ తనను నిలదీస్తున్నట్లుగా అనిపించింది.

భరించలేనంత ఊపిరాడనట్లుగా అనిపించడంతో,

ఆ వాతావరణం నుండి తప్పించుకోవడానికన్నట్లు

దేవేంద్రనాథ్ వడివడిగా లోపలి గదిలోకి వెళ్లాడు.

అక్కడ మూలలో ఉన్న నాన్న పాత పెట్టెను తెరిచాడు.

అందులో నాన్న రాసుకున్న పాత డైరీ దొరికింది.

దేవేంద్రనాథ్ దాన్ని చదవడం మొదలుపెట్టాడు.

అందులో ఒకచోట నాన్న రాసుకున్న వాక్యాలు:

”ఈరోజు దేవేందర్ సైకిల్ కొనివ్వలేదని నన్ను చేతకాని వాడన్నాడు. వాడు అన్న మాట నిజమేనేమో. పిల్లలు అడిగింది కూడా కొనివ్వలేని ఈ బతుకు ఎందుకు? రాత్రంతా నిద్రపట్టలేదు. ఎలాగైనా అప్పు చేసి వచ్చే వారం వాడికి సైకిల్ కొనివ్వాలి. గోదావరి, నన్ను క్షమించు.”

”ఎస్.ఆర్.ఎస్.పి కాలువ హన్మకొండ, భీమారం దాకా సాగిపోయింది.

ఎన్నో ఊళ్లు పచ్చని పైర్లతో కళకళలాడుతున్నాయి.

తన బతుకు మాత్రం ఆగిపోయింది.

కాలువతో ఎందరో కాంట్రాక్టర్లయ్యారు.

బిజినెస్‌తో కోటీశ్వరులయ్యారు.

ప్రభుత్వ ఖజానా గోదావరి కాలువలా ప్రవహించింది.

పచ్చని పంటలతో రైతులు ధనికులయ్యారు.

భూమి లేని కూలీలు ఉద్యమబాట పట్టారు.

అందులో తాను ఏమీ చేయలేకపోయాడు.

వేలాదిమంది గల్ఫ్‌కు పోతూనే ఉన్నారు.

ఈ అభివృద్ధి వాళ్లకు ఏమిచ్చింది.

అడవిలో అన్నలు ఎక్కడున్నారో తెలియదు.

ఏమైపోయారో తెలియదు.

తాను ఇవన్నీ చూడటానికే బతికున్నట్టా?”

ఇది నాన్న చెప్పని కథ అనుకున్నాడు దేవేంద్రనాథ్.

దేవేంద్రనాథ్ డైరీ తిప్పాడు.

ఓ చోట చూపు ఆగింది.

”వాడు ఇంత మోసం చేస్తాడనుకోలేదు.

పెన్షన్ డబ్బులతో పాటు నర్మద పెళ్లి కోసం

కూడబెట్టిన డబ్బులు, బంగారం అన్నీ పట్టుకుపోయాడు.

ఇవ్వవద్దని అడ్డుకుంది గోదావరి.

రంధితో గోదావరి రెండు రోజులు అన్నం ముట్టలేదు.”

ఆ వాక్యాలు చదవగానే దేవేంద్రనాథ్ గుండె ఆగినంత పనైంది.

చిన్నప్పుడు తను అన్న కఠినమైన మాటలు గుర్తొచ్చి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

డైరీలోని ఆ నిశ్శబ్ద అక్షరాలు అతని స్వార్థానికి అద్దం పట్టాయి.

తాను తన కరీంనగర్ భవంతిని నాన్న జీవితకాలపు సంపాదనపై, చెల్లెలి భవిష్యత్తుపై కట్టుకున్నానని, తీరా నాన్న కష్టాల్లో ఉన్నప్పుడు

బ్యాంకు కిస్తీల నెపంతో మొహం చాటేశాడు.

దేవేంద్రనాథ్ కు నాన్న తన వల్లే చనిపోయాడా?

అనుమానం వచ్చింది. తీరని పశ్చాత్తాపం కలిగింది.

డైరీని గుండెలకు హత్తుకుని దేవేంద్రనాథ్ పెద్దగా ఏడ్చాడు.

ఏడుపు విని తల్లి గోదావరి దగ్గరకు వచ్చింది.

”ఇప్పుడు ఏడ్చి ఏం లాభం రా... బతికున్నప్పుడు

నాన్న కష్టాన్ని, ప్రేమను మనం ఎవ్వరం సరిగ్గా చదవలేదు.

ఇప్పుడు ఆ డైరీ చదివితే ఏం లాభం?” అంది గోదావరి.

”నాన్నలాంటి అన్న పోయాడు” అని జనం వచ్చినప్పుడల్లా లక్ష్మి కన్నీరు తుడుచుకుంటోంది. గుడిలో నిద్రలు పూర్తయ్యాయి.

నర్మద అమ్మ చేతులు పట్టుకుంది. నర్మదలో ఏదో తెగువ ప్రవేశించింది.

”పదమ్మా... మనం హైదరాబాద్ వెళ్దాం.

నాన్న నీకోసం పెన్షన్ వదిలి వెళ్లాడు, నేనున్నాను తోడుగా’’అంటూ అమ్మను తీసుకొని బయలుదేరింది.

దేవేంద్రనాథ్ పశ్చాత్తాపంతో, ఒంటరిగా ఆ పాత ఇంట్లోనే నిలబడిపోయాడు.

× × ×

ఆరేడు నెలలకు దేవేంద్రనాథ్ కరీంనగర్‌లోని తన ఇంటిని తాకట్టు పెట్టి అదనపు బ్యాంకు అప్పు తీసుకున్నాడు.

నాన్న పెన్షన్ డబ్బు, నర్మద పెళ్లి డబ్బు మొత్తాన్నిపూర్తిగా నర్మద పేరు మీద బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాడు.

”నాన్నా, లేటైంది. కానీ ఇచ్చేశాను” అని ఫోటోకు దండం పెట్టాడు.

×. ×. ×

”సదానందం. తండ్రి పేరు శివయ్య. శివయ్య కుల వృత్తి జీవితం ముగిసింది.

సదానందం ప్రభుత్వ ఉద్యోగ జీవితం ముగిసింది...

దేవేంద్రనాథ్ కు పూర్తి స్థాయి ఉద్యోగం రాలేదు.

సదానందం డైరీలో రాసుకున్న ఎన్నో ముచ్చట్లు దేవేంద్రనాథ్ మనసును జీవితాంతం తొలిస్తూనే ఉంటుంది.

గోదావరి ఇప్పుడు హైదరాబాద్‌లో నర్మదతో ఉంది.

గోదావరి కళ్లు కాలువలా - ఎండిపోకుండా అందరి కోసం పారుతూనే ఉన్నాయి.

గోదావరి కాలువ పోచంపాడు శ్రీరాం సాగర్‌గా పేరు మార్చుకుంది.

ఓ కాలువ మానేరు డ్యాంలో కలిసిపోయింది.

అక్కడి నుండి కాకతీయ కెనాల్‌గా పేరు మార్చుకుంది.

పేరు ఏదైతేనేం, గోదావరి కాలువ ప్రవహిస్తూనే ఉంది.

జీవితమూ అంతే. శివయ్య కొడుకు సదానందం.

సదానందం చెల్లెలు లక్ష్మి.

లక్ష్మి కొడుకు శ్యాంసుందర్.

సదానందం కొడుకు దేవేంద్రనాథ్.

పేరు మారుతుంది. జీవితం అలానే కొనసాగుతుంది తరతరాలుగా!”



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

## భారీ మూల్యం

ప్రకృతి తల్లి ఓర్పుకు కూడా
ఒక హద్దంటూ ఉంటుంది.
మనిషి స్వార్థపు అడుగులతో
ఆ హద్దును దాటిస్తే?.
నదులు నిశ్శబ్దం వీడి
తమ బాధను చెబుతున్నాయి.
కొండలు కన్నీరు కార్చి
అడవులు ఆవేదన పడుతున్నాయి.
చెట్లను నరికిన చేతులతో
నీడ కోసం వెతుకులాడుతున్నాడు.
చేజేతులా చేతులు కాల్చుకొని పట్టుకోడానికి
ఆకులు లేక అల్లాడిపోతున్నాడు.
భూమిని గాయపరిచిన మనిషి
బతుకు కోసం పోరాటం చేస్తున్నాడు.
గాలి కలుషితమై
శ్వాసే ప్రశ్నగా మారింది.
నీరు విషమై
జీవమే సంకటమయింది.
ఇప్పుడు ఇకనైనా కళ్ళు తెరిచి
యుద్ధప్రాతిపదికన
మొక్కలు విరివిగా నాటాలి.
ప్లాస్టిక్ ని తూతూమంత్రంగా కాదు
సంపూర్ణంగా నిషేధించాలి.
ప్రకృతి ని రక్షిస్తాం అనే నినాదం మంత్రంలా
పఠించాలి.
ప్రకృతి ముద్దు
ప్లాస్టిక్ వద్దు
తారకమంత్రమై నినదించాలి

-ఎ. విక్టోరియా రాణి
7660995779

## ఎక్కడ నీతి

నిరంతరం మాటలు యుద్ధాలు
తిట్ల పురాణాలు
బూతుల రాద్ధాంతాలు
శాంతి సందేశాలు మాయం.
తెల్లారితే చాలు ఒకరి పై ఒకరు
తిట్టుకోవడాలు మాటల బాణాలు
విసురుకోవడాలు
ఎక్కడ ఉంది నీతి
అంతటా అవినీతే...
ఎవరు మంచి వాళ్ళు అందరూ
దొంగలే...
ఓటర్లు దొంగలే పాలకులు
దొంగలే...
ఇది ప్రజాస్వామ్యమా అని
పిస్తోంది...
నిరంకుశమైన బాగుండునని పిస్తోంది..
గెలవక ముందు తీయని మాటలు
గెలిచాక అవ్వన్నీ నీటి మూటలు..
డిబేట్ లు తిట్ల పురాణాలు...
శాంతి సందేశాలు మాయమై
అశాంతి యుద్ధాలు మొదలయ్యాయి....
దేశాల మధ్య గోడవలే
గుళ్లలో బళ్ల లో అంతటా
రాజకీయాలే రాక్షస త్వాలే
ఎవరూ ఏం చేయలేని
పరిస్తితి ఎవరికి వారే
రాజులు అనే అహంకారం

-వొజ్జల రమాదేవి
+91 90322 24588

## మనం కవులం

కత్తి కంటే కలం గొప్పది నానుడి
కరవాలం చేయు గాయం మాన్పును కాలం
కలం వెలుగులు మిగులును కలకాలం
రవి గాంచని చోటు కవి గాంచును
అక్షరాలనే ఆయుధాలుగా ఏరికూర్చి
అంబులపొదిలో అస్త్రశస్త్రాలుగా పేర్చి
పదాలనే పటాసులుగా పేల్చి
చేయాలి అక్షర సమరం
అభ్యుదయ భావాలతో
ఆదర్శ సమసమాజ స్థాపనకై
అంతర్గత జ్యోతిని వెలిగించాలి
సమాజపు చీకటిని పారద్రోలే
కరదీపికలం మనం
అక్షరజ్యోతితో అఖండ వెలుగులు చిమ్మే
తారజువ్వలం
సకల జనుల సంక్షేమానికై
చేయవలెను మనం మార్గదర్శకం
ప్రజాహితమే మన ప్రధమ కర్తవ్యం
సకల జీవరాశులలో అగ్రజులం
సర్వేశ్వరుడి ఉత్తమ సృష్టి మనుజులం
సమస్తజనుల దిశ దశలను మార్చే
మనం కవులం

-సయ్యద్ అబ్దుల్ నజీర్
చరవాణి 8897811024

## మత్తును తరిమేద్దాం

సరదాగా స్నేహితులతో మొదలై
అలవాటుగా మారి వ్యసనమై అంటుతుంది.
ఒళ్ళు గుల్ల చేస్తు ఆర్థికంగాఅవస్థలుపెడుతూ
సమాజంతో' ఛీ'కొట్టిస్తుంది.
కుటుంబాన కలహాలు రేపి
బజారున పడేస్తుంది చిత్తు చేసి.
మంచితనాన్ని మంట కలిపేస్తూ
జీవశ్చములా చేసేస్తుంది మత్తు.
భార్యాబిడ్డలకు బాధలు మిగులుస్తూ
అనుక్షణం అవమానాల పాలుచేస్తుంది.
ప్రేమలు బంధాలను బీటలు వార్చి
బాధలతో బంధిఖాన చేస్తుంది.
ఇన్ని అనర్థాలకు హేతువైన
మత్తు మహమ్మారిని పీక నులిమితే.
అందరికీ ఆనందం కుటుంబాన వసంతం
భార్య పిల్లల నవ్వుల సందడి.
అందుకే!మత్తుకు దూరంగా ఉండి
మంచి మనిషిగా వెలుగుదాం.

-మాదాసు లక్ష్మి నారాయణ
+91 99497 07512

## జీవనశైలి

గడియారంతో పోటీపడి చేసే
ఉరుకుల పరుగుల
జీవనపయనంలో
మానసిక ఒత్తిడి చూపిస్తోంది
మనసుపై శరీరంపై
తీవ్ర ప్రభావం.
ఇంటాబయట
తీరికలేని పనులతో అలసట
విశ్రాంతి లేకపోవటం
నిద్ర పట్టకపోవడం
చిరాకు పరాకు
ప్రతిఒక్కరి జీవిత గమనంలో వ్యక్తిగత
సమస్యలతో ఆరాటంతో పోరాటం
ప్రణాళికాబద్ధంగా
జీవనశైలి మార్చుకోవడం
నరులకు ఎంతో అత్యవసరం.
సమతుల్య ఆహారం
పోషకవిలువల పండ్లరసాలు తీసుకుంటూ
ఆలోచనలు మరిచి
ప్రశాంతంగా ఎనిమిది
గంటలు నిద్రించాలి.
నిత్యం వ్యాయామం యోగా చేయడంవల్ల
చేకూరును మానసికప్రశాంతత
రక్త సరఫరా మెరుగు పడి పొందుదురు
సుమా స్వస్థత.

-సిరిపురం వాణిశ్రీ
+91 93920 23988

## ఇనాక్ రచనల్లో పరిశోధనాత్మక సమాచారం




'సాహిత్యం నూతన దర్శనం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య టీ. గౌరీశంకర్, సుజాత, శ్రీనివాస్, కొలకలూరి ఇనాక్, కళా జనార్ధనమూర్తి, రత్నమాల

హైదరాబాద్, జులై 8: ఇనాక్ రచనల్లో పరిశోధనకు తగినంత సమాచారం లభిస్తుందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవీ శ్రీనివాస్ అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జరుగుతున్న ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహంలో భాగంగా సోమవారం వేమూరి కమలాకర్ సుజాత రచించిన 'సాహిత్యం నూతన దర్శనం' గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాహితీవేత్త కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇనాక్ సాహిత్యంపై సుజాత కొత్త అంశాలు సృజించారన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ టి. గౌరీశంకర్ పాల్గొన్నారు. కార్యక్రమానికి తొలుత రత్నమాల బృందం సంగీత గానగోష్ఠి జరిగింది.

## పాఠం

ఎందుకో తెలియకున్నా
ఏ లక్ష్యమూ నిర్దేశింప బడకున్నా
ఎప్పుడూ ఒకటే తిరుగుడు వేసట!.
అక్కడున్నంత సేపూ
అరక్షణం విశ్రాంతి కావాలన్నా
ఆగనివ్వని పరుగుల తిప్పట!.
ఎవరితోనో అకారణ కొట్లాట
యింకెవరితోనో ప్రేమ సయ్యాట
ఏది ఎందుకో ఆలోచించనివ్వని
నిరంతర జలకాలాట!.
గాలి ఆహారాల సమాతౌల్యత తప్పినా
తెలియని వ్యాధేదో తాటాలున సోకినా
ఆదుకునే చెట్టు..
దాక్కునే గుహ కాపాడలేని వైనం.
అనుకోని ఉపద్రవం నుంచి
కానరాని విపత్తు నించి
స్వయంగా రక్షించుకోలేని దైన్యం.
తొట్టె లోని చేపలం మనం
యిట్టే ముగిసే జీవన గమనం
"క్షణభంగురతే"
నేర్చుకోవాల్సిన పాఠం!



- ఎస్. కాశింబి
905 2216044

# తాత్విక మార్గంలో 'జీవామృత శతకం'

పుస్తక సమీక్ష






ప్రతులకు: 5-6,
బి.సి. బాలుర హాస్టల్ ఎదురుగా,
మల్లికార్జున నగర్,
అలియాబాద్-షామీర్‌పేట(మం)
రంగారెడ్డి జిల్లా.

జీవామృత శతకము పేరిట ఆధ్యాత్మిక, అచల, లౌకిక భావాత్మక కంద పద్యమాలను భృంగాచల వంగరి నారాయణాచార్యులుగారు. గతంలో వీరు పది శతకాలను తెలుగు పాటక లోకానికి సమర్పించి వున్నారు. ఎన్నో ప్రచురణలు, పరిష్కరణలు, అనువాదాలుగాక స్వయం వీరు జానపద కళారంగంలో విశేష అనుభవం గురించి గురు స్థానంలో వున్నవారు. సంగీత, గాన, కళావిద్యలో సందర్భాను సారంగా తమ ప్రతిభను ప్రదర్శించి ప్రశంసలనం దుకు న్నారు. జానపద కళాప్రయోగ ప్రదర్శనలకు పంతులుగా వ్యవహరించేవారు. ఎన్నో ఆధ్యాత్మిక ప్రజ్ఞతో శతకాలు వెలువరించారు. జీవో ఈశ్వరః అన్న వేదాంత భావన వీరి శతకంలో జీవామృతాన్ని పంచు తుంది. ఈ శతకాన్ని వంగరి నారాయణాచార్యులు గారు వారి అల్లుడు కీ.శే.బొమ్మ బాబురావు కు అంకితమిచ్చారు. వారి ఆత్మకు శాంతి చేకూరే విధంగా అశ్రుతాంజలులు సమర్పించారు. తర్వాత బొమ్మ వంశావళి, అలియాబాదు గ్రామ ప్రాశస్త్యం, రత్నాలయము, ఆంజనేయాలయం, పరిశ్రమలు, గురుప్రార్థన, గురు పరంపరాధ్యానం, ఆపైన పరిపూర్ణ అచల ధ్యానంను బహు చక్కగా పద్యాలుగానూ, శ్లోకాలుగానూ కడు రమ్యంగా రచించారు. డా॥త్రివేణి గారి సంపాదక జీవసారం అంటూ శతకంలోని విషయాలను వివరించిన తీరు ప్రశంసనీయం. అయితే వంగరి వారి శతక పద్యాలలో ఎన్నో లౌకికమైన జీవన విధానం లో ఎలా మసలు కోవాలో చెప్పిన విధానం బాగుంది. ఇంద్రియ లోలుడు గాకుండా బంధాల్లో చిక్కకుండా బ్రతికేటి నరుడు పరమోన్నతమును పొందుననీ, పరమేశుని చేరడానికి అరిష ద్వర్గాలను అణచవలయుననీ, తాపత్రయముల చేత అపహాస్యము పాలు కావద్దన్నారు. ముక్తికి తోవ భక్తియనీ, శక్తియుక్తులన్నీ క్షణ భంగురములనీ స్పష్టం చేశారు. ఒక్కడే ఆ పరబ్రహ్మము, ఒక్కడే వైకుంఠపతి, ఒక్కడే శివుడున్, ఒక్కటే బ్రహ్మం బంతట అంటూ పరబ్రహ్మ స్వరూపాన్ని మనకు గొప్పగా చెప్పారు. ఈ దేహమే దేవాలయము, దేహమున జీవుడుండియు సోహంబిని నడుచుచుండె అంటూ రాసిన పంక్తులు జీవన సత్యాలు. ముక్తిని పొందాలంటే యుక్తులతో పనిలేదు యోగ్యత చాలునంటారు. శక్తి లేకున్నా కేవలం భక్తి కలిగి వుంటే చాలును అన్నారు. దానధర్మము జేయక దీనుల రక్షింపలేక దీవెనలేకన్, వేణుని పూజలు జేయక, మానవుడు ఉండి ఏమి ఫలము ఈ మహిలో అన్న మాటల్లో అద్భుతమైన ఒక సందేశం వుంది. కోపం దుర్గుణమనీ, కోపం మనిషికి శాపం అనీ, కోపం వెన్నంటి వుంటే క్రూరమేనంటారు. కోపం పాపం బెరుగదు, పాపులుగా పేరు పొందుచు, ఆపదలో చిక్కు కుంటారని వారించారు. పాపపు పనులను చేస్తూ, పాపకర్మలు అంటి, తాపములు భరించే దుకు మరల పుట్టరాదంటారు. పాపకర్మలు జీవుని విడువవు అన్న గొప్ప సందేశాన్ని అందించారు. ఎన్నో మంచి విషయాలు ఈ శతకం నిండా నిండుగా వున్నాయి. జీవులకు ఏదో తమ వంతు మంచి చేయాలన్నదే వీరి ధ్యేయంగా కనపడుతోంది. వీరు అన్నట్లు ఆయుర్వేద విద్యలో, చికిత్సలో అనేక మెలకువలు తెల్సినవారు. ఆధ్యాత్మిక తాత్విక మార్గంలో ఇప్పుడిక ఈ విధంగా సాహిత్య జగతిలో తమ వంతు విశేష కృషి చేస్తున్నారు. డా॥వి. త్రివేణి సంపాదకత్వంలో వెలువడిన ఈ శతకం అట్ట మీద బొమ్మ కూడా ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించింది.



- డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

## తోడేలు గర్వం

(కథ)



సుందరవనం అనే అడవిలో ఒక తోడేలు ఉండేది. దానికి గర్వం ఎక్కువ . ఏదైనా మిగతా జంతువులను మెచ్చుకుం టుంటే దానికి ఉక్రోషం వచ్చేది. అన్నీ జంతువులు తననే పొగడాలని దాని ఆశ.

అది ఒకసారి ఆహారం కొరకు బయలు దేరింది. అక్కడ చెట్టు పైన ఉన్న ఒక ఉడుత దానిని చూసి దానితో "మన మృగ రాజు సింహం పరాక్రమం ముందు అన్ని దిగదుడుపే" అని అంది. అది విన్న తోడేలు "ఆ ...ఏముంది దాని గొప్పతనం ...నీవు చిన్న ప్రాణివి. నీకు తెలియదు. అది క్రూరమృగమే ! నేను క్రూరమృగాన్నే!" అని అంది.

అది తర్వాత మరికొద్ది దూరం వెళ్లగానే దానికి ఒక చెట్టు పైన కోతి కనిపించింది. అది తోడేలును చూసి దానితో "తోడేలా! మన మృగరాజు సింహం ముందు ఇతర క్రూరమృగాల పరాక్రమం ఎందుకు పనికి రాదు "అని అంది. అది విన్న తోడేలు ఆ సింహం పై అసూయతో "ఓ కోతీ ! నీకు ఏం తెలియదు. ఆ సింహం నాకు ఎదురుపడనీ. దాని సంగతి చెబుతా "అని అంది. ఆ కోతి దాని మాటలను విని నవ్వుకుంది .

తర్వాత దానికి ఒక ఏనుగు ఎదురైంది. అది ఏనుగుతో "ఓ ఏనుగు మామా! నేను గొర్రెపిల్లను అమాంతంగా పట్టుకుంటా నని నీకు తెలుసు. నేను సింహం సమానమే కదా!"అని అంది. దాని మాటలకు ఏనుగు కూడా నవ్వి ఊరుకొంది. ఇంతలో గ్రామం నుండి తప్పిపోయి వచ్చిన ఒక గొర్రెపిల్ల ఆ తోడేలుకు కనిపించింది. అది వెంటనే ఆ గొర్రె పిల్లను పట్టుకుంది.

ఆ తోడేలు మరికొంచెం ముందరికి వెళ్ళగానే మృగరాజు సింహం ఒక జింక పిల్లను నోట కరుచుకొని దానికి దూరంగా కనిపించింది. అది గొర్రెపిల్లను గట్టిగా పటుకొని నెమ్మదిగా ముందుకు వెళ్లుతూ ఎలుగుబంటితో "ఓ ఎలుగు మామా! ఆ సింహం జింకపిల్లను నోట కరిచి పట్టు కుంటే నేను కూడా గొర్రె పిల్లను నోట కరచి పట్టుకున్నాను. పరాక్రమంలో అది నేను ఇరువురం సమానమే కదా! " అని అంది. అది విని ఎలుగుబంటి నవ్వి ఊరుకుంది.

ఇంతలో సింహం ఆ తోడేలు వద్దకు ఆ జింక పిల్లతో సహా వచ్చి ఈ తోడేలు ఎలుగుబంటి తో పలికిన మాటలను దూరం నుండి విన్నది. అది తన ముందు గొర్రె పిల్లను పట్టుకున్న తోడేలును చూసి కోపంతో ఆ జింక పిల్లను వదిలిపెట్టి ఒక్క ఉదుటున ఆ తోడేలు పైన దూకింది. సింహం పంజా దెబ్బ తగలగానే ఆ తోడేలు వెంటనే ఆ గొర్రె పిల్ల ను వదిలి అక్కడి నుండి పారిపోయింది. సింహం దాని వెంట పరిగెత్తింది.ఆ తోడేలు ఎలాగో ఆ మృగరాజుకు దొరకకుండా చెట్ల పొదల్లో దూరి తప్పించుకొంది. ఆ సింహం చాలా దూరం వరకు దానిని తరిమికొట్టి అది కనబడకపోవడంతో అది అక్కడినుండి వెళ్లి పోయింది.

ఇక్కడ సింహం ముట్టని ఆ గొర్రెపిల్ల వెంటనే అక్కడి నుండి తన గ్రామానికి 'బ్రతుకు జీవుడా' అంటూ పారిపోయింది. సింహం వదిలిపెట్టిన ఆ జింకపిల్ల కూడా తన ప్రాణాలు దక్కినందుకు సంతోషించి అది కూడా వెంటనే అక్కడినుండి అడవి లోకి పారిపోయింది.

అక్కడ సింహం పంజా దెబ్బను రుచి చూసిన తోడేలు "అమ్మో! దీని బలం చెప్పనలవి కాదు. ఇంకా నయం! నేను గొర్రె పిల్లను వదిలిపెట్టకుండా ఉంటే అది నా పైన దాడి చేసి నన్ను చంపేసేది" అని అనుకొంది. తర్వాత అది "గొప్ప వారితో ఎప్పుడు విరోధం పనికిరాదు. మన బలం మనం గుర్తెరిగి ప్రవర్తించాలి. నా గర్వం అణిగింది. ఇకముందు సింహం గురించే కాకుం డా మిగతా వాటి గురించి ఒక్క మాట కూడా నేను మాట్లాడను. ఎవరి గొప్ప తనం వారిదే!" అని అం టూ అది ఆహారం వేటలో నిమగ్నమైంది.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
9908554535

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1812వ రోజు 'సరదా' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'సరదా' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839



## జాలీ జాలీగా!

సరస సంభాషణలు
రసాలూరు ఫలాలు
దాపరికం లేక
మనసులో మాటలు
కొంటె
కోణంగి చేష్టలు
జాలీ జాలీగా అల్లరి
నొప్పించక ఒప్పించే
నవ్వు తెప్పించే
మాటలు, చేతలు
మానసిక ఒత్తిడికి
మందు
స్నేహానికి విందు.
కొంటె కిట్టప్ప అల్లరి చేతలు
గోపిక ల మొత్తుకోళ్ళు
నారదుని తో తంటాలు
సత్యభామ అలకలు
తెనాలి రామలింగడి
చమత్కారాలతో
చిత్తయిన సభికులు.
జాలీ జాలీగా మాటలు దొర్లిస్తూ
టపటప రిటార్ట్ ఇస్తూ
కోతిబావంటూ మరదలు
ఆటపట్టిస్తూ బాల్యంలో
అమ్మాయిల బెంచీ
వెనకాల కూచున్న
అల్లరిమూక జడలు ముడి
పెడితే
మాస్టారు చెవి కీ ఇస్తే
కప్పలా గంతులేస్తూ
పిల్లిమొగ్గలకుర్రాళ్లు.
అమ్మ చూడకుండా
చింతపండు ఉప్పు బెల్లం తో
లాలిపాప్ రుచులు
ఇసుకతో పిచ్చుకగూళ్లు
వియ్యాలవారిని ఏడిపిస్తూ
హాస్యంగా
"ముక్కబియ్యం వండి
వడ్డించే వదినెగారి
వడ్డాణం ఊడిపోయే"
పాటలు మాయం.
క్లాసులో పిల్లల సరదా కబుర్లు
వారి రాతలతో నవ్వుకునే
అధ్యాపకులతో బడి పూలతోట
విశ్వనాథ, జాషువాల
సరదా విసుర్లు
సాహిత్యంలో అమరం.
సరదాగా సిగరెట్ మద్యం
నేడు తీయు ఉసురు
చెరువులో ఈత
కన్నవారి కడుపు కోత
అతి లేకుండ మితంగా
సరదాలు
"దడిగాడు వాన సిరా"
రాసినదెవరురా?
టీచర్ ప్రశ్నకు
అది చదివినవారే టీచర్"
అంటే వద్దు కోపం!
చిర్నవ్వుతో
వేసవి సెలవులపై
రాయమంటే వ్యాసం,
వస్తాయి పుంఖానుపుంఖాలుగా
జవాబులు
భావాలు-అనుభవాలు.

-ఎ.రాజ్యశ్రీ

## రసం లేని పాకం

బడలిక తీర్చేది
ఒత్తిడిని మరిపించేది
అంతరాలను తొలగించే
సరదా చేతికందే పరదా.
మనసుకి ఉల్లాసానిచ్చేది
తనువుని విలాసాల నింపేది
అలుసు అలుపుల మిశ్రమం
మిగుల్చు చివరకు శూన్యం
అందరికీ చేతనైన పదం సరదా.
సరదా వినోదం కావచ్చు
విలాసం అయితే ప్రమాదం.
మితిమీరిన సరదా
కావచ్చు మరొకరికి ఆపద.
శృతితప్పిన సరదా
వైరాలకు విడత
వివేక విచక్షణల
నియంత్రిత సరదా
పండగ
లేకుంటే వ్యర్థ వ్యయాల
దండగ.
ఏ వయస్సుకా సరదా
మనుషులే కాక
అన్య జీవులు కోరేది
సరదా.
తనువును మరిచి
మనస్సును నింపేది.
సరదా అనే విడిది.
సరదా లేని జీవితం
రసం లేని పాకం
స్వరం లేని గాత్రం
ప్రకాశం లేని వెలుతురు.

-రాజప్ప

## కాలక్షేపం

సరదాకు వెలతారు షికార్లకు
ఆ షికార్లే పుట్టిస్తాయి
భలేగా పుకార్లను
సరదాకు సినిమాకు వెళ్తారొకరు
సిగరెట్టు తాగుతారు మరొకరు
ముచ్చట్లు పెడతారు
చాడీలు చెప్తారు
వ్యంగ్యాస్త్రాలు సంధిస్తారు
సరదా అంటే
గమ్యంలేని రహదారి
ఎటువైపు వెళ్తుందో తెలియదెవరికీ
చిన్నా పెద్దలనే భేదముండదు
వావి వరుసలకు చోటుండదు
కులమతాలకు అడ్డుండదు
అంతరాలకు హద్దుండదు
కొందరికి ఆనందాలనందిస్తే
మరికొందరికి విషాదం
సరదా ఎవరికి
దురద పెట్టించరాదు
సరదా సరదా సిగరెట్టు
తాగని వానికి సైతం
చేస్తుంది చేటు
సరదా చేసేది మాటైనా
పాటైనా
ఎదుటివారికి ఇబ్బంది
కారాదు
మనస్సు నొప్పించరాదు
లోక హితాన్ని
కాలరాయరాదు
ఎదుటివారికి ఇబ్బంది
రాకుండా
సరదాకు
పరదా తగిలించాలి
అందరి మనస్సులకు
ఉల్లాసాన్ని కల్పించాలి
లోక కళ్యాణానికి వేదిక
కావాలి
ఆనందాల
హరివిల్లుగా ఉండాలి.

-గుండం మోహన్ రెడ్డి

## సరదాకు వేయకు పరదా

సందడి చేస్తూ
అందరికీ ఆనందాన్ని పంచుతూ
తిని హాయిగా కూచుని
సరదాగా చెప్పే కబుర్లు
నేడు కాలంలేక కాకరకాయలు
కావద్దు నేతి బీరకాయలు!!.
సరదా మాటలు
సరదా చేతలు
మనసుకు ఆహ్లాదం
హృదయ సంగమం
కష్టాలెన్ని వున్నా మరపింపచేసే
ఇష్టమైన మలాం.
సరదాలతో కడుపునింపుకొని
పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వుతూ
పిట్టలా స్వేచ్ఛగా ఎగిరి గంతులేస్తూ
సంబరాల అంబరాన్ని
తాకుతూ
గడిచిన క్షణాలు
గడిచిన దినాలు.
నాడు నేడు ఏనాడు
ఆరోగ్య సంజీవని
సరదాగా బ్రతుకు గడుపు
జీవన వాహిని నడుపు
సరదాకు వేయకు పరదా
ఉండాలి సదా సదా!!

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

## అందం.. ఆనందం!

అలసటకు ఓదార్పు
టెన్షన్కి ఆటవిడుపు
సరదా సరదా జోక్స్
నవ్వుల హరివిల్లై
అందిస్తాయి
తనువూ మనసుకు
ఆరోగ్యమే మహాభాగ్యంగా..
సరదా సరదా పండుగలు
నింపుతాయి అందరిలో సరదా
మనసంతా ఖుషీ ఖుషీగా
ఆత్మీయానురాగాల సందళ్ళతో.
కల్లాకపటం లేని పిల్లల మాటల్లో
ఆటల కేళీ రంగేళీ సరదా
కవ్వింతల నవ్వింతలతో
ఉల్లాసోల్లాసాల జాతరతో
మనసంతా రాగం తియ్యగా
పాటల పల్లకిలో ఊరేగుతూ
పరవశ మాధుర్యం పొందే సరదా.
రొటీన్ లైఫ్ బిజీ బిజీ
బోరు బావురుమంటూ నోరుతెరిచి
చికాకు చిత్తంతో కోపం తాపం
కొండెక్కి కూర్చుంటుంది
జీవితమంటే బోర్ కొడుతుంది
గోల పెడుతుంది మనసు
మరో మార్పు కావాలని
మరిపించి మురిపించే సరదా
రెక్కలు కట్టుకుని స్వేచ్ఛగా ఎగరాలని.
పెదవుల నవ్వులు పూయించే
సరదా అందరినీ కలుపుతుంది
స్నేహంతో స్వచ్ఛంగా
చిలిపిగా అల్లరి చేస్తుంది
మనసు పలికే మాటలతో..
హాస్యం లాస్యం లేని జీవితం
సరదా మరిచిన సంసారం
నిస్సారం
ఎండిపోతుంది ఎడారిలా
గుండె చెరువై పోతుంది
నీరు లేని మోట బావిలా..

- పి.పద్మావతి

## సంతోషమే సగం బలం!

సరదా ఓ పరదా లేని సందడి!
సందడిగా ఉంటే అదో సంతోషం!
సంతోషమే సగం బలం కదా!
నేనైతే నవ్వుతూ ఉంటానుగా!
నవ్విన నాప చేను పండదా?
సరదా ఓ కిక్కిచ్చే టానిక్!
సరదాగా లేనోణ్ణి సంతకి తోలు!
సరదాగా చెప్పే కబుర్లు
సరదాగా పాడే పాటలు
సరదాగా ఆడే ఆటలు
తెస్తాయి నీలో ఉల్లాసం!
సరదాకి సిగరెట్ తాగినా
సరదాగా సెల్ఫీలు దిగినా
సరదాకి ఈత కొట్టినా
సరదాకి తగవులు పెట్టినా
సరదాగా ఊరికే తిట్టినా
రారా పోరా అని కసిరినా
మీ ఉల్లాసాలకు భంగం కదా!
ప్రాణాలకు ముప్పొస్తుందిగా!
నన్నంటుకోకు నామాల కోతి...
అన్నట్టు ఉండే ఒంటి పిల్లులు
ఇల్లు దాటిపోని ఇబ్బంది గాళ్ళు,
సుఖ పడలేరెపుడూ జీవితంలో!
అందుకే, నవ్వుతూ బతకాలిరా!
జీవితం ఆనందంగా గడపాలిరా!.

-కోలా సత్యనారాయణ

## బలం-లాభం

సరదాలు లేని బతుకు
చక్కెర లేని కాఫీ..
రకరకాల సరదాలు
కరకరలాడే పకోడీలు.
ఆటల్లో సరదా
మాటల్లో సరదా
ప్రతిపూట
సరదాల సంపద
నింపుతుంది
మన జీవితాన్ని
తీయతీయని రుచులతో.
సరదాగా
స్నేహితులతో కాలక్షేపం
అదొక పెద్ద నిక్షేపం.
పిల్లలతో పిల్లలమై
కల్లాకపటాలు మరిచి
కేరింతలతో ఆడుతుంటే
చెప్పలేని ఆసరదా
బహుధా స్మరణీయం.
బడిలో రారా పోరాలతో
రాజుకునే కోపాలతో
అంతలోనే రాజీలతో
ఆ తర్వాత అదే సరదాగా
స్మృతి పథాన మెదలు
మెత్తని పువ్వులా.
పతితో సతి
సతితో పతి
సరదాల సుగంధాలు
పంచుకోకపోతే
సంసారం ఎండిన సాగరమే.
బంధుమిత్రుల కలయికలో
సరదా సరదా సంభాషణలు
కాలానికి పెట్టని భూషణాలు.
చిటమట లాడే మోహాలతో
చిరుబురులాడే మాటలతో
సరదా శోభలకు
పరదాలు వేసి
"నన్ను అంటుకోకు
నామాల కాకి"
అనుకునే వారికి
సరదాలు-సరసాలు
బహుదూరం.
అవి లేని జీవితం
రసంలేని కాసారం.

-డా.సి.వసుంధర



తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

-సంపాదకులు

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

## సముద్రం పై వల

ప్రపంచ సంపన్న మూర్ఖ శిఖామణి
సముద్రం పై వల వేసాడు !
సముద్రం వల వల ఏడుస్తోంది
దేశాలన్నీ ఉక్కిరి బిక్కిరి!!.

పక్షులు కాదు !
సముద్రం పై క్షిపణులు ఎగురుతున్నాయి
చమురు పడి కెరటాలు కొట్టుకుంటున్నాయి
లోపలి చేపలకు ఆక్సిజన్ అందటం లేదు
నూనెకు అతుక్కుంటున్నాయి
రేపు ఋతుపవన మేఘాలు నూనెను వర్షిస్తాయేమో
మరి సముద్రం పై వల తీసే సాహసి ఎవరు ?
దేశ దేశాల నాయకులూ తమ పై
వల పడ్డట్టే ఉలకని పలకని శిలలే !

-కందాళై రాఘవాచార్య
8970593638

## మనిషి. A.I.

మనిషిలో మనసు మరలో చిప్పు
అనిచ్చల మనసు ఆదేశాలు తప్పో-ఒప్పో
ఎవరి వరం వారికే రిమోట్
పాస్వర్డ్ పెట్టుకున్న గాడ్జెట్!.

యంత్రం కావద్దు బస్మాసుర హస్తం!
ఓ మనిషి జాగ్రత్త ...జాగ్రత్త!.

దేవదానవులు రుషులు
తపస్సు చేసి పొందిరి వరాలు
మనిషి మేధ కొత్తదాన్ని
ఉనికి లోనికి తెస్తుంది.

అదే తపస్సు అదే రీసర్చ్ అందిస్తుంది
సరికొత్త సామాగ్రి
అదే మనిషికి వరం!

దేవదానవులు మాయోపాయాలు పన్ని
చేసిరి యుద్ధాలు పరకాయ ప్రవేశాలు
శాప ప్రతి శాపాలు విమోచనాలకు
అవనిపై దేవుళ్ళు ఎత్తిరి అవతారాలు!

A.I.వచ్చినాక మనిషి మారిండు
మెదడునంతా యంత్రానికి తాకట్టు పెట్టాడు
యంత్రానికి తలూపే వింత మనిషైనాడు
కష్టించి పనిచేసే తత్వం మరిచాడు
తానే దేవుడునని తలపోస్తున్నాడు!.చ

A.I.సృష్టించిన మనిషి పైనే
బస్మాసుర హస్తమై తిరగబడితే...
మనిషి పరిగెత్తేది ఎటు. ఎటు. ఎటు !

A.I. పరిజ్ఞానంతో
మనిషి దేవుడు అవుతాడో !
తెలివి మీరి దానవుడవుతాడో!
మరో చారిత్రక ఏఐ యుద్ధానికి
కారకుడు అవుతాడో!

కాలానికి కళ్ళు లేవనుకోకు
నీ పనితనం గమనిస్తూనే ఉంటుది
ఓ మనిషి జాగ్రత్త...
నీ చేతిలోనే నీ తలరాత!

పాస్వర్డ్ పెట్టుకున్న గాడ్జెట్
యంత్రం కావద్దు బస్మాసుర హస్తం
నీ చేతిలోనే నీ తలరాత!

పాస్వర్డ్ పెట్టుకున్న గాడ్జెట్
యంత్రం కావద్దు బస్మాసుర హస్తం
నీ చేతిలోనే నీ తలరాత.

పాస్వర్డ్ పెట్టుకున్న గాడ్జెట్!
యంత్రం కావద్దు బస్మాసుర హస్తం
నీ చేతిలోనే నీ తలరాత!
ఓ మనిషి జాగ్రత్త జాగ్రత్త!

-పట్లోళ్ళబక్కారెడ్డి
9705315250

## తెలంగాణ నేల

బంగారు నేలయిది
బ్రతుకు జూపినదిది
పరదేశి యైనను
పలకరించిన నేల.

గంజి గడకలతోని
కడుపులు నింపుకొని
కన్నవారిని పోషించి
గౌరవ మందిన నేల.

పాల్కురికి సోమన్న
బమ్మెర పోతన్న
కంచర్ల గోపన్న
మల్లి సూరనయన్న.

తెలగాన ప్రాచీన
కవి శేఖరుల గన్న
దివ్య తేజో మూర్తి
తెలగాణకు తల్లి.

ఎములాడ రాజన్న
యాదాద్రి నరసన్న
కొమురెల్లి మల్లన్న
కొండగట్టంజన్న.

కొలువైన దేవుళ్ళు
కొంగు బంగారమై
కోట్లాది జనులకు
ఆరాధ్య దైవాలు.

కుమ్మరైనను గాని
కమ్మరై నను గాని
చాకలైనను గాని
మంగలైనను గాని.

కర్షకులు కార్మికులు
కులభేదములు లేక
కష్టాలు పంచుకొని
కాలము గడిపిరిట.

నేటి కాలమునందు
రాజకీయములాయె
కుల మతమ్ములలోన
గొడవలు చెలరేగె.

పార్టీల పేరుతో
ప్రజలంత విడిపోయి
ప్రతిరోజు పల్లెల్లో
ఘర్షణలు చెలరేగె.

కలిసి జీవించండి
ఐక్యతను పెంచండి
తెలంగాణ ఘన కీర్తి
నలు దిశల నింపండి.

-నర్సింగోజు లక్ష్మయ్య
9866152371

# భారతదేశపు రాజసపు చిహ్నం పులి



1969 జూలై 9 భారత దేశ వన్యప్రాణి సంరక్షణ చరిత్రలో మైలురాయిగా నిలిచిన రోజు. ఆ రోజున భారత వన్యప్రాణి బోర్డు పులిని భారత జాతీయ జంతువుగా అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయం కేవలం ఒక జీవిని ప్రతినిధిగా ఎంపిక చేయడమే కాదు, భారత దేశం యొక్క సహజ సంపదను, వన్యప్రాణి సంరక్షణ పట్ల దేశం తీసుకున్న దృఢ నిశ్చయాన్ని ప్రతిబింబించే చిహ్నంగా నిలిచింది.

ఆ కాలంలో పులుల సంఖ్య దేశ వ్యాప్తంగా వేగంగా తగ్గి పోతుండటంతో వేట, అక్రమ వాణిజ్యం, అటవీ విపత్తులు, నివాస ప్రదేశాల నాశనం వంటి కారణాల వల్ల పులుల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. 1947 నాటికి దేశంలో సుమారు 40,000 పులులు ఉన్నాయని అంచనా, కానీ 1972 నాటికి ఆ సంఖ్య 1,800కి పడిపోవడం ఆందోళనకరం. ఇలాంటి సంక్షోభంలో ప్రభుత్వం ప్రజల దృష్టిని ఆకర్షించే విధంగా పులికి జాతీయ గుర్తింపు ఇచ్చింది. ఇది ఒక అవగాహనాత్మక చర్యగా, ఒక రక్షణ ప్రమాణంగా మారింది.

పులిని జాతీయ జంతువుగా ఎంపిక చేయడానికి గల ముఖ్యమైన కారణాలలో శక్తి, ధైర్యం, రాజసమైన రూపం ప్రధానమైనవి. భారతీయ సంస్కృతిలో పులి అంటే శక్తి, స్వేచ్ఛ, ఉత్సాహానికి చిహ్నం. ఇది దేశపు భౌగోళిక వైవిధ్యాన్ని ప్రతినిధిస్తుందే కాకుండా, దేశంలోని విభిన్న అటవీ ప్రాంతాల్లో.. హిమాలయాల నుండి సుందర్బన్ల వరకు విస్తరించి ఉంటుంది. పులి 'జీజూవలీ జూతీవటజీబినీతీ'గా, ఆహార గొలుసులో అగ్రస్థానంలో ఉండి, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలకంగా పనిచేస్తుంది.

పులి భారతీయ సంస్కృతిలో, పురాణాలలో, మతపరమైన చిత్రీకరణల్లో విశేష స్థానం పొందింది. దుర్గాదేవి వాహనంగా పులి ప్రాచుర్యం పొందినదే కాదు, జానపద కళల్లో, శిల్పాల్లో, కథల్లో ఈ జంతువు కేంద్ర బిందువుగా ఉంటుంది. దీని అందం, శక్తి, విలాసవంతమైన ఆకృతి భారతీయులకు గర్వకారణం.

1969లో తీసుకున్న ఈ నిర్ణయం పులుల సంరక్షణకు ఒక బలమైన ఆరంభంగా నిలిచి, 1973లో "ప్రాజెక్ట్ టైగర్" అనే దేశ వ్యాప్తంగా అమలైన బృహత్తర పథకానికి మార్గం ఏర్పడింది. ఈ ప్రాజెక్ట్ పులుల నివాస ప్రాంతాల పరిరక్షణ, వేట నియంత్రణ, అటవీ అభివృద్ధి వంటి అంశాలలో విశేష పురోగతిని సాధించింది. 2006 నాటికి దేశవ్యాప్తంగా 1,411 పులులు మాత్రమే ఉన్నా, తర్వాతి దశాబ్దంలో అనేక చర్యల ఫలితంగా 2018 నాటికి ఆ సంఖ్య 2,9 67కి, 2022 నాటికి 3,167కి చేరింది. ఇది ప్రపంచంలో అత్యధిక పులుల సంరక్షణ భారత్‌దే అనే ఘనతకు మార్గం వేసింది.

పులిని జాతీయ జంతువుగా ప్రకటించడమొక గొప్ప మానవ విలువల ప్రతిబింబం. ఒక జంతువును కాపాడటానికి దేశం చేసిన సంకల్పం, సమగ్ర దృష్టిని, శాస్త్రీయ వ్యవస్థను కలిపి పనిచేయడమే దీనికి మూలం. పులిని కాపాడాలంటే ఆ నివాస వ్యవస్థను కాపాడాలి. అది పూర్తిగా ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని జీవుల జీవనశైలి సమతుల్యంగా ఉండాలి. ఇది పర్యావరణ పరిరక్షణకు, జీవవైవిధ్య రక్షణకు ప్రాథమిక భోధన.

ఈ ప్రకటనతో పాటు పులి భారత దేశ చిహ్నాలలో స్థిరంగా స్థానం సంపాదించింది. ప్రభుత్వ లోగోలు, నాణేలు, తపాలా బిల్లులు, పర్యాటక ప్రచారాలపై పులి ముఖచిత్రం కనిపించటం ప్రారంభమైంది. జాతీయ చిహ్నంగా పులి ప్రాముఖ్యత దేశ ప్రజల్లో గర్వాన్ని పెంచింది. పులి మన సంస్కృతిలో, ప్రకృతిలో, తత్వ శాస్త్రం లోనూ ఒక జీవిలా కాక, జీవితం అనే భావనను ప్రతిబింబించే జంతువుగా మారింది.

ఈ చారిత్రాత్మక నిర్ణయం ద్వారా భారత దేశం తన వన్యప్రాణుల పట్ల గౌరవాన్ని, బాధ్యతను ప్రకటించింది. పులి నేడు కేవలం ఒక జంతువు కాదు.. అది జీవ వైవిధ్యానికి రక్షణ కవచం, భారత దేశానికి శక్తి ప్రతీక, మానవుడు ప్రకృతితో కలిసిన జీవన విధానానికి గుర్తింపు.పులిని కాపాడటం అంటే... మన భవిష్యత్తును కాపాడటం.

1969 జూలై 9....భారత వన్యప్రాణి బోర్డు, పులిని జాతీయ జంతువుగా ప్రకటిం చిన దినం.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు అండగా నిలవాలి: గజానంద్ దేశాయి

నిజామాబాద్, జులై 8: ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఎవరికైనా సమస్యలు ఎదురైతే కాంగ్రెస్ కార్యకర్తలు వెంటనే పరిష్కరిం చేలా కృషి చేయాలని డోంగ్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజానంద్ దేశాయి సూచించారు. బుధవారం గ్రామాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, నమోదు అవుతున్న దరఖాస్తులు, ఎన్యూమరేషన్ ఫారాలను పరిశీలించారు. అలాగే పార్టీ కార్యకర్తలు ప్రజలకు అందిస్తున్న సహాయాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా గజానంద్ దేశాయి మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో అర్హులైన వారి పేర్లు మిస్ కాకుండా, కొత్త ఓటర్ల నమోదు సక్రమంగా జరిగేలా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా ఇబ్బం దులు ఎదుర్కొంటే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవా లని, ప్రభుత్వం, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుజాత శివారెడ్డి, దోతి సర్పంచ్ సంగ్రామ్ పటేల్, మాజీ ఎంపీటీసీ దీన్ దయాల్, నాయకులు విలాస్ గైక్వాడ్, సాయిలుగోండా తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఘాతంతో పాడి గేదె మృతి

మెదక్, జులై 8: గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం వార్డులో విద్యుత్ ఘాతానికి గురై ఓ పాడి గేదె మృతి చెందింది. స్థానిక రైతు పెరుగు నవీన్ యాదవ్‌కు చెందిన గేదె మేతకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది.

పాడి గేదె తమ కుటుంబానికి ప్రధాన జీవనాధారమని, దాని మృతితో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని రైతు నవీన్ యాదవ్ తెలిపారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

స్థానిక వైస్ ఛైర్మన్ మహేందర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రమాదాలకు కారణమవుతున్న విద్యుత్ లైన్లను వెంటనే మరమ్మతులు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు

# డాక్టర్ సినారె 'విశ్వంభర' జాతీయ పురస్కారానికి మలయాళ కవి ఎంపిక



హైదరాబాద్, జులై 8:జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి స్మృత్యర్థం శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు ప్రదానం చేసే 'విశ్వంభర'జాతీయ సాహిత్య పురస్కారానికి ఈ సంవత్సరం ప్రముఖ మలయాళీ కవి కె. సచ్చిదానందన్ ను ఎంపిక చేశారు.

జూలై 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే డాక్టర్ సి.నారాయణరెడ్డి 95వ జయంత్యుత్సవంలో సచ్చిదానందన్‌కు 5 లక్షల రూపాయల నగదు, జ్ఞాపిక,ప్రశంసాపత్రంతో సత్కరించనున్నట్టు ట్రస్టు అధ్యక్షులు సి.గంగ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఆధునిక మలయాళ కవులలో అగ్రశ్రేణికి చెందిన సచ్చిదానందన్ కవిగా,సాహిత్య విమర్శకునిగా, నాటక కర్తగా,సంపాదకునిగా, కాలమిస్టుగా, అనువాదకునిగా బహుముఖీన సేవలు అందించారు. ఢిల్లీ కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శిగా సేవలు అందించారు. ఆయన కవితలు మలయాళం ఇతర భారతీయ భాషల్లో 18 సంపుటాలుగా వెలువడ్డాయి.

త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి సచ్చిదానందన్ కు ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని ప్రదానం చేస్తారని ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు సి. గంగా, మేనేజింగ్ ట్రస్టీ తెలిపారు.




అందరూ ఆహ్వానితులే

తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో
అఖిల భారతీయ కుమ్మర శాలివాహన ప్రజాపతి కుంభకార్ మహాసంఘ్
తెలంగాణ రాష్ట్రం (రి.నెం. 1109/2023) మరియు
తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో

శ్రీ శ్రీ శ్రీ సిద్ధప్ప వరకవి రాజయోగి జయంత్యుత్సవం
ఎజెండా: జయంతి మరియు కవి సమ్మేళనం

ముఖ్యఅతిథి:
శ్రీ డాక్టర్ ఎన్. బాలా చారి తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి

విశిష్ట అతిధులు:
శ్రీ బైస దేవదాసు - సంపాదకులు, నేటి నిజం పత్రిక
శ్రీ కటకం నర్సింగ్ రావు - వ్యవస్థాపకులు, మన ఆలోచన సాధన సమితి
శ్రీ బడేసాబ్ - వ్యవస్థాపకులు, తెలుగు భాషా చైతన్య సమితి
శ్రీమతి డా. రాధా కుసుమ - చైర్పర్సన్, కుసుమ ధర్మన్న కళాపీఠం
శ్రీ రాజగోపాల్ నాయుడు - గౌరవ అధ్యక్షులు, తెలుగు భాషా చైతన్య సమితి

తేదీ: 09-07-2026 (గురువారం)
వేదిక: రవీంద్ర భారతి (సాహితీ కుటీరం), హైదరాబాద్
సమయం: సా.గం.5:30 ల నుండి రా.గం.8:00 ని.ల వరకు

ఆహ్వానించువారు

రాష్ట్ర గౌరవ అధ్యక్షులు : చిట్టిమల్ల అశోక్ కుమార్ ప్రజాపతి
గౌరవ సలహాదారులు: ఊటూరి సుదర్శన్ ప్రజాపతి, డా. కె. రమేష్ ప్రజాపతి, చేబ్రోలు లక్ష్మినారాయణ ప్రజాపతి, నడికుడ యాదగిరి ప్రజాపతి, కుమ్మరి యాదగిరి ప్రజాపతి, సరికొండ ప్రసాద్ బాబు ప్రజాపతి, సిల్వేరి శ్రీశైలం ప్రజాపతి, మిట్టాలాల్ ప్రజాపతి, కొలనుపాక చంద్రమౌళి ప్రజాపతి, డా. కే. శ్రీనివాస్ ప్రజాపతి, రాంబలి పండిత్ ప్రజాపతి

రాష్ట్ర VEACCI అధ్యక్షులు: ఎలిశాల కృష్ణ ప్రజాపతి
రాష్ట్ర ఉపాధ్యక్షులు: కొర్లపల్లి స్వామి ప్రజాపతి, డా. కొండా ఆశన్న ప్రజాపతి, మల్కాజ్ గిరి కుమార్ ప్రజాపతి, ఆవునూరి రామమూర్తి ప్రజాపతి, మల్లికంటి వీరన్న ప్రజాపతి, శంకర్ పండిత్ ప్రజాపతి
రాష్ట్ర కార్యదర్శులు: ఏరుకొండ శంకర్ ప్రజాపతి, దామెర వెంకటేష్ ప్రజాపతి, వర్కాల బాలరాజు ప్రజాపతి, మాడుగుల జానయ్య ప్రజాపతి, సిలివేరు నరసింహ ప్రజాపతి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి: దొమ్మాట నాదం ప్రజాపతి
రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు: కాకులారం హనుమంత్ ప్రజాపతి
రాష్ట్ర వృత్తి విభాగం: అధ్యక్షులు: దామ ప్రభాకర్ ప్రజాపతి, ప్రధాన కార్యదర్శి: కుమ్మరి శంకరప్ప ప్రజాపతి
రాష్ట్ర ఉద్యోగుల విభాగం: అధ్యక్షులు: జివిలికపల్లి నరహరి ప్రజాపతి, ప్రధాన కార్యదర్శి: సిరుసవాడ చంద్రం ప్రజాపతి
రాష్ట్ర విద్య విభాగం: అధ్యక్షులు: పాలబిందల నర్సయ్య ప్రజాపతి, ప్రధాన కార్యదర్శి: కుదురుపాక ముత్తయ్య ప్రజాపతి

రాష్ట్ర కోశాధికారి: మారుపాక యాకన్న ప్రజాపతి
రాష్ట్ర ధార్మిక విభాగం అధ్యక్షులు: కుమ్మరి ఈశ్వర్ కుమార్ ప్రజాపతి
రాష్ట్ర న్యాయ విభాగం అధ్యక్షులు: తొల్లికొండ రామకృష్ణ ప్రజాపతి
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు: కొలిచెల్మి కృష్ణ ప్రజాపతి, కే పరశురామ్ ప్రజాపతి, తీగుళ్ళ చంద్రకాంత్ ప్రజాపతి, మాడుగుల రాజేష్ ప్రజాపతి

శ్రీ సిలివేరు శంకర్ ప్రజాపతి
రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి & జయంతి కన్వీనర్

శ్రీ మిరుదొడ్డి శివానంద్ ప్రజాపతి
రాష్ట్ర అధ్యక్షులు


# 'దుఃఖం లేని చోటు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, జులై 8: ప్రస్తుత సమాజం దుఃఖమయంగా మారిందని, దుఃఖం లేని చోటును సమాజం వెతుక్కుంటుందని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహిత, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ ఛైర్మన్ డా॥నందిని సిధారెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డా॥ కసప నరేందర్ రచించిన **"దుఃఖం లేని చోటు'** పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచీకరణ వల్ల సమాజంలో కులవృత్తులు విధ్వంసం జరిగిన తీరును కవిత్వం రూపంలో రచయిత చక్కగా వివరించారని కొనియాడారు. గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ.. యుద్ధం సమాజానికి ఎప్పటికీ నష్టమేనని కవి వివరించిన తీరును అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలను తీసుకురావాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్. బాలాచారి, సాహితీవేత్త డాక్టర్ కసప శ్యాంసుందర్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు డా॥నాళేశ్వరం శంకరం, డాక్టర్ వింధ్య, కె. మమత తదితరులు పాల్గొన్నారు.

# సమాజాన్ని ప్రేమించిన సాహితీవేత్త ఇనాక్



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, జులై 8: సమాజాన్ని అధ్యయనం చేసి అసమానతల పట్ల నిరసన తెలిపిన మనుషులను ప్రేమించిన సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ అని ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న అభినందించారు.

త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న సాహితీ వేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహంలో భాగంగా ఆయన రచించిన **'అమ్మ'** పుస్తకం ద్వితీయ ముద్రణ సంపుటి ఆవిష్కరణ సభ మంగళవారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డా॥గోరేటి వెంకన్న సంపుటిని ఆవిష్కరించి ఇనాక్‌ను సన్మానించారు. వివక్షత ఎదుర్కొన్న ఇనాక్‌ని సమాజంపై ఆగ్రహం సహజంగా ఉన్నా కూడా సున్నితంగా వ్యక్తీకరించడం ఆయన వ్యక్తిత్వమని చెప్పారు. ఇనాక్ సాహిత్యం ప్రాంత కుల మతాలు పరిధిలో ఇమడవని అన్నారు. అమ్మ సంపుటిని విశ్లేషణ చేసిన సాహితీ విమర్శకుడు డా॥ కోయ కోటేశ్వర రావు జంతువులను పాత్రలుగా తీసుకుని పిల్లలకు నైతిక విలువలు బోధన అమ్మకథలు అని చెప్పారు. పిల్లల పాఠ్యపుస్తకంగా అమ్మ సంపుటి చేర్చాలన్నారు. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ.. గానసభ 8 ఏళ్లుగా తన జన్మదినం సందర్భంగా సాహితీసప్తాహం నిర్వహించడం వల్ల తన జీవితకాలం పెరిగిందని, అందుకు వారి ప్రేమకు ధన్యవాదాలు తెలిపారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన సభలో పొత్తూరి సుబ్బారావు, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# దళిత చైతన్యానికి ఇనాక్ సాహిత్యం దిక్సూచి...

## కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత, ప్రముఖ కవి డా॥నందిని సిధారెడ్డి



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, జులై 8: మనుషులను హీనంగా చూసే సమాజంలో దళిత చైతన్యమే లక్ష్యంగా ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్య సృష్టి చేశారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత, ప్రముఖ కవి డా॥నందిని సిధారెడ్డి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై గానసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహంలో భాగంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కథకుడు విహారి రచించిన 'ఇనాక్ కథలు సాహిత్యం దృక్పథం' సంపుటిని డా॥నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఇనాక్ రచనలు సమాజంలోని వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేవిగా నిలిచాయని, నాటి నుంచి నేటి వరకు మారని సామాజిక వాస్తవాలను ప్రతిబింబించాయన్నారు. ప్రముఖ కథకుడు విహారి మాట్లాడుతూ.. ఇనాక్ సాహిత్యంలో మానవ హృదయ ఘోషతో పాటు విశ్వ మానవ శ్రేయస్సు ప్రతిధ్వనిస్తుందని చెప్పారు. ప్రపంచ స్థాయి సాహిత్య పురస్కారాలకు ఆయన రచనలు అర్హమైనవని అభిప్రాయపడ్డారు. గానసభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య కొలకలూరి ఇనాక్, కవి జల్ది విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పూర్తి పారదర్శకత

## -ప్రతి సోమవారం బిల్లుల విడుదల: కలెక్టర్ కోయ శ్రీహర్ష



కరీంనగర్, జులై 8: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతోందని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం ఎన్టీపీసీ కాకతీయ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన రామగుండం నియోజకవర్గ స్థాయి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలుగా విభజించి, గెజిటెడ్ అధికారుల పరిశీలన అనంతరం ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతోనే మంజూరు ఉత్తర్వులు జారీ అవుతాయని వివరించారు.

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎల్-1 జాబితాలోని 449 మందికి ఇళ్లు మంజూరైనా, 184 మంది మాత్రమే నిర్మాణాలు ప్రారంభించారని తెలిపారు. మంజూరైన లబ్ధిదారులు 45 రోజుల్లోపు నిర్మాణం ప్రారంభించాలని, లేనిపక్షంలో నిబంధనల ప్రకారం మంజూరు రద్దయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. అయితే రద్దుకు ముందు ప్రజాప్రతినిధుల ద్వారా లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకుంటామని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బిల్లులు ప్రతి సోమవారం విడుదల చేస్తున్నామని, నిర్మాణ పురోగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిన మేరకు చెల్లింపులు జరుగుతాయని తెలిపారు.


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.